ప్రజాశక్తి

శుక్రవారం 4 అక్టోబర్ 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు


# అసైన్డు భూముల్లో గోల్‌మాల్

- రెవెన్యూ కార్యాలయాలలో రికార్డుల పరిశీలన
- వైసిపి హయాంలో అక్రమాలపై అంతర్గత విచారణ

వినుకొండ మండలంలోని అసైన్డ్ భూములు

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి**

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో అసైన్డు భూముల రిజిస్ట్రేషన్లలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై ఆర్‌డివో స్థాయిలో పరిశీలన జరుగుతోంది. కొన్ని దశాబ్ధాల క్రితం పేదలకు అప్పటి ప్రభుత్వాలు ఇచ్చిన భూములను బడాబాబులు తమ అధీనంలోకి తీసుకుని గతేడాది అక్రమంగా రిజిస్ట్రేషన్లను చేయించుకున్నారని ఆరోపణలు వచ్చాయి. పేదలకు ఇచ్చిన భూములను ఆన్‌లైన్‌లో రికార్డులు మార్చేశారు. లబ్ధిదారుల పేరు మీద పట్టా ఉన్నా ఆన్‌లైన్‌లో మాత్రం మరొకరి పేరుతో రికార్డులు రూపొందించారు. సంబంధిత బడా బాబుల నుంచి సొమ్ములు దండుకున్న రెవెన్యూ అధికారులు అడ్డగోలుగా నిబంధనలకు విరుద్ధంగా రికార్డులను తారు మారు చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటును ఆసరాగా చేసుకుని క్రయ విక్రయాలు కూడా జరిపారు. రిజిస్ట్రేషన్లు జరిగాయి. ప్రభుత్వం మారడంతో సంబంధిత భూముల అసలైన వారసులు ఆర్‌డివో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికే ఈ అంశం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని రాష్ట్ర భూ పరిపాలన శాఖ నుంచి అధికారులకు ఇటీవల ఉత్తర్వులు వచ్చాయి. సంబంధిత వ్యక్తుల నుంచి పిటీషన్లు స్వీకరించిన జిల్లా కలెక్టర్లు విచారణ చేయిస్తున్నారు.

అసైన్డు భూములు సాగు చేసుకోవడం తప్ప క్రయ విక్రయాలు చేయడం చట్టరిత్యా నేరమని చెబుతూ ఈ భూములను నిషేధిత జాబితాలో పెట్టారు. ఈ భూముల విక్రయాలకు గతప్రభుత్వం కొంత వెసులుబాటు కల్పించింది. పట్టా పొంది 29 ఏళ్ల అనుభవంలో ఉన్న వారికి అసైన్డు భూముల విక్రయాలకు పచ్చజెండా ఊపారు. అర్హత లేని వారికి రెవెన్యూ అధికారులు హక్కులు కల్పించారు. ఈ నేపథ్యంలో కొందరు భూస్వాములు పేదల బలహీనతలను సొమ్ము చేసుకుని అరకొర ధరలు చెల్లించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ విధంగా గుంటూరు జిల్లాలో 8 వేల ఎకరాలు, పల్నాడు జిల్లాలో 12 వేల ఎకరాల భూములు చేతులు మారాయని తెలిసింది. ఇప్పటికే అసైన్డు భూములు రెండు మూడు చేతులు మారాయి. 2019-24 మధ్య కాలంలో పనిచేసిన పలు రెవెన్యూ అధికారులు రికార్డుల మార్పిడిలో కీలక పాత్ర పోషించారు. గుంటూరు జిల్లాలో తాడికొండ, తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి, పెదకాకాని, మేడికొండూరు, ఫిరంగిపురం, చేబ్రోలు తదితర మండలాల్లో ఎక్కువగా అక్రమాలు జరిగాయని తెలిసింది. పల్నాడు జిల్లాలోని వినుకొండ, మాచర్ల, చిలకలూరిపేట, గురజాల, పెదకూరపాడు నియోజకవర్గాల్లో ఈ తరహా అక్రమాలు జరిగాయని తెలిసింది. అంతేగాక ఈ వ్యవహారంలో గతంలో ఆయా డివిజన్ కేంద్రాల్లో పనిచేసిన ఆర్‌డివోలు కూడా తహశీల్దార్లకు, వీఆర్‌వోలకు సహకరించారని సమాచారం. మొత్తం అసైన్డు భూముల్లో ఏయే ప్రాంతాల్లో ఎక్కువ క్రయ విక్రయాలు జరిగాయి? వాస్తవ సాగుదారులు ఎవరు, వారి వారసులు ఎవరు? వారికి ఉన్న అర్హతలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ప్రధానంగా 2022, 23, సంవత్సరాల్లో జరిగిన అసైన్డు భూముల రిజిస్ట్రేషన్లపై ఉన్నతాధికారులు అంతర్గత విచారణ చేస్తున్నారు.

బ్యాంకులో ఆందోళనకు దిగిన డిపాజిటర్లు

# డిపాజిటర్ల నగదు గోల్‌మాల్

- ఐసిఐసిఐ బ్యాంకు వద్ద ఖాతాదారుల ఆందోళన
- వడ్డీ జమకాకపోవడంతో విచారణకు రాగా వెలుగులోకి

**ప్రజాశక్తి-చిలకలూరిపేట**

వృద్ధాప్యంలో ఆర్థిక బద్రత కోసం కొంతమంది, పిల్లల చదువులు, పెళ్లిళ్లకని మరి కొంతమంది.. దాచుకున్న డబ్బు, బంగారం గోల్‌మాల్ అయ్యింది. తమ డిపాజిట్లకు జమవ్వాల్సిన వడ్డీ గతనెల జమకాకపోవడంతో ఖాతాదార్లు ఒక్కొక్కరుగా గురువారం మధ్యాహ్నం నుండి బ్యాంకుకు రావడం మొదలుపెట్టారు. తీరా విషయం తెలుసుకుని ఆందోళనకు దిగారు. వివరాల ప్రకారం..పట్టణంలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న ఐసిఐసిఐ బ్యాంకులో కొందరు ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసుకున్నట్లు ఖాతాదారులు చెబుతున్నారు. వడ్డీ జమకాకపోవడంపై వీరు వివరణ కోరగా ఇప్పటి వరకు ఆ వడ్డీ తమ బ్యాంకు నుండి డిపాజిట్ కాలేదని, వేర్వేరు ప్రైవేటు ఖాతాల నుండి జమైందని సిబ్బంది వివరించారు. దీంతో తాము మోసపోయామని తెలిసి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఆశ్రయించారు. మరోవైపు డిపాజిట్లకు సంబంధించి ధ్రువపత్రాలు తేవాలని ఖాతాదార్లను బ్యాంకు సిబ్బంది కోరగా వారు తెచ్చి చూపడంతో అవి తమ రికార్డుల్లో నమోదు కాలేదని చెప్పటంతో విస్తుపోయారు. బంగారం తనఖా విషయంలోనూ గోల్‌మాల్ జరిగిందని తెలుస్తోంది. గతంలో బ్యాంకులో పనిచేసిన మేనేజర్, సిబ్బంది ఇందుకు కారణమని ఖాతాదారులు ▶ 2లో


## ఎయిమ్స్‌లో కిడ్నీ మార్పిడి విజయవంతం 2లో


## పత్తి కొనుగోలు కేంద్రాలపై పల్నాడు జెసి సమీక్ష

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

ప్రత్తి కొనుగోలు కేంద్రాల ముందస్తు ఏర్పాట్లపై జిల్లా స్థాయి కమిటి, మార్కెట్ యార్డుల కార్యదర్శులతో పల్నాడు జిల్లా జెసి సూరజ్ ధనుంజయ్ గురువారం సమీక్షింకారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షల్లో సిఎంఎపిపిలో రైతుల నమోదును 100 శాతం పూర్తి చేయాలని, గుర్తించిన కొనుగోలు కేంద్రాల్లో భద్రత, తూకాలు సక్రమంగా ఉండేలా తనిఖీలు చేయాలని చెప్పారు. కొనుగోలు కేంద్రాల పరిధిలోని వే బ్రిడ్జిలను తనిఖీలు చేయాలని ఆదేశించారు. లూజు ప్రత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో జిల్లా అగ్రిట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి సూర్య ప్రకాష్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి ఇతర అధికారులు, సిసిఐ బయ్యర్లు పాల్గొన్నారు.

## రూ.25 లక్షల పురుగు మందులు స్వాధీనం

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

పల్నాడు జిల్లా గురజాల మండలం గోగులపాడులో ఎరువులు, పురుగు మందుల షాపుల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు గురువారం తనిఖీలు చేశారు. రూ.72,689 విలువగల పురుగు మందులను స్వాధీనం చేసుకున్నారు. 14 లీటర్ల కాలం చెల్లిన పురుగు మందులను గుర్తించారు. నిషేధిత కలుపు మందు ఆరు కిలోలను గుర్తించి రూ.10,800 విలువైన మందును, నిబంధనలకు విరుద్ధంగా విక్రయించేందుకు నిల్వ చేసిన రూ.24.20 లక్షల విలువైన 470 లీటర్ల పురుగు మందులను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో విజిలెన్సు వ్యవసాయ అధికారి కె.రమణ కుమార్, సిఐ కె.చంద్రశేఖర్, స్థానిక వ్యవసాయాధికారి సంధ్యారాణి పాల్గొన్నారు.

## ఇల్లు నరకంగా ఉంది..

**అదృశ్యమైన విఆర్‌ఓ సూసైడ్ నోట్‌తో కలకలం**

**ప్రజాశక్తి-ముప్పాళ్ల**

కనిపించకుండా పోయిన నార్నెపాడు విఆర్‌ఓ సత్తెనపల్లి మల్లికార్జునరావు సూసైడ్ నోట్ చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 1వ తేదీన తన కుమారుడు కనిపించకుండా పోయాడనీ పలుదేవర్లపాడుకు చెందిన నాగేంద్రమ్మ ఫిర్యాదుతో ముప్పాళ్ల పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మల్లికార్జునరావు రాసిన సూసైడ్ నోట్ లభ్యమైంది. అందులో 'నా తల్లిదండ్రులు నన్ను అర్థం చేసుకోలేదు. ఇష్టం లేని పెళ్లి చేశారు.. నాకు ఇల్లు ▶ 2లో

## లారీ ఢీకొని భవన నిర్మాణ కార్మికుడు మృతి

- మరో ఇద్దరి పరిస్థితి విషయమం
- కూలీలు ప్రయాణిస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ఘటన
- మరో రెండు ప్రమాదాల్లో ఒకరు మృతి, నలుగురికి గాయాలు

**ప్రజాశక్తి-పిడుగురాళ్ల**

కూలీలు వెళ్తున్న ట్రాక్టర్‌ను లారీ ఢీ కొట్టడంతో భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన ఘటన మండలంలోని బ్రాహ్మణపల్లి వద్ద గురువారం ▶ 2లో

## పోరాట ఫలితమే చెత్త పన్ను రద్దు

**పట్టణ పౌర సంక్షేమ సంఘం**

**ప్రజాశక్తి-తాడేపల్లి**

యూజర్ ఛార్జీ రూపంలో చెత్త పన్ను విధింపు నిర్ణయాలకు వ్యతిరేకంగా మంగళగిరి-తాడేపల్లి పట్టణ పౌర సంక్షేమ సంఘం సుదీర్ఘ కాలం ప్రజలను చైతన్య పరుస్తూ నిర్వహించిన పోరాటాల ఫలితంగా నేడు రాష్ట్ర ప్రభుత్వం చెత్త పన్ను వసూలను ఉపసంహరించుకుందని మంగళగిరి-తాడేపల్లి పట్టణ పౌరసంక్షేమ సంఘం కన్వీనర్ దొంతిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆదేశాలను రాష్ట్రంలోని అప్పటి వైసిపి ప్రభుత్వం పట్టణ నగరపాలక సంస్థ పరిధిలో ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ చేపట్టినందుకు ప్రత్యేకంగా చెత్త పన్ను వసూలు ప్రారంభించి పేద మధ్యతరగతి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారాలు విధించిందని తెలిపారు. దీనికి వ్యతిరేకంగా మంగళగిరి-తాడేపల్లి పట్టణ పౌరసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తీవ్ర ఆందోళన పోరాటాలు నిర్వహించి ప్రజలను చైతన్య పరుస్తూ, దరఖాస్తులపై సంతకాలు సేకరించి సచివాలయాలు వద్ద, జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. చెత్త పన్ను వసూలు వల్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను గమనించి చెత్త పన్ను రద్దు చేస్తున్నట్లు సిఎం చంద్రబాబు ప్రకటించడం హర్షణీయమన్నారు. భవిష్యత్తులో ప్రజలపై ఎలాంటి ఆర్థిక భారాలూ విధించకుండా చెత్త పన్ను వసూలును గుణపాఠంగా తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

చెక్కును రాంబాబుకు అందచేస్తున్న కె.వి.బ్రహ్మం తదితరులు

## వరద బాధితులకు అవోపా విరాళం

**ప్రజాశక్తి-గుంటూరు**

వరద బాధితుల కోసం అవోపా ఏర్పాటు చేసిన ఆపద్భంధు పథకానికి అసోసియేషన్ గుంటూరు యూనిట్ రూ.2,56,546లు విరాళం అందజేసింది. ఈ మొత్తాన్ని స్థానిక అరండల్ పేటలోని అవోపా కార్యాలయంలో గురువారం జిల్లా అధ్యక్షులు కె.వి.బ్రహ్మం రాష్ట్ర అధ్యక్షులు తడవర్తి రాంబాబుకు అంద చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ విజయ వాడలో 600ల కుటుంబాలకు రూ.5వేలు చొప్పున రూ.30 లక్షల నగదు, రూ.10 లక్షల విలువ చేసే నిత్యావసర సరుకులు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహాయాన్ని అందించిన గుంటూరు యూనిట్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ రామ్‌కుమార్, కార్యదర్శి రాదాకృష్ణయ్య, ట్రెజరర్ మహంకాళి శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు

మంగళగిరి ఆటోనగర్ వీవర్‌శాలను సందర్శించిన ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు

## వీవర్‌శాలను సందర్శించిన ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు

**ప్రజాశక్తి - మంగళగిరి**

మంగళగిరి ఆటోనగర్ లోని వీవర్ శాలను గురు వారం ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు జయశర్మ, కేటీ తదితరులు సందర్శించారు. చేనేత కార్మికులు తయారు చేస్తున్న వివిధ రకాల చీరలను పరిశీలించారు. వీవర్స్ శాల కమిటీ సభ్యులు గుత్తి కొండ ధనుంజయరావు, కారంపూడి అంకమ్మరావు లను వీవర్ శాల సంబంధించిన విషయాలు వారిని అడిగి తెలుసుకున్నారు. మంత్రి నారా లోకేష్ చేనేత కార్మికుల చేయూత నందించేందుకు వారికి అధునాతన డిజైన్లు నేర్పి ంచడంతోపాటు ఆదాయం పెరిగే మార్గాలను ఈ వీవర్స్ శాల ద్వారా చేనేతకు కొత్త రూపు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు.

# ఎయిమ్స్‌లో కిడ్నీ మార్పిడి విజయవంతం



**ప్రజాశక్తి - మంగళగిరి**

ఎయిమ్స్ (ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) మరో మైలురాయిని సాధించిందని మంగళగిరిలోని ఎయిమ్స్ డైరెక్టర్ సీఈఓ మద బందకర్ తెలిపారు. గురువారం మంగళగిరి ఎయిమ్స్ ఆడిటోరి యంలో మీడియాతో మాట్లాడారు. ఈ సంవత్సరం ఆగస్టు 30వ తేదీన మొదటి కిడ్నీ మార్పిడి సర్జరీ చేసిన ఒక నెల వ్యవధిలో మూడు ప్రత్యక్ష సంబంధిత మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. మొదటి లైవ్ సంబంధిత కిడ్నీ మార్పిడిని 2024 ఆగస్టు 30న విజయవాడకు చెందిన వృత్తి రీత్యా మెడికల్ రిప్రజెంటేటివ్‌గా ఉన్న 29 ఏళ్ల మద్దెల శ్రీరామ్ అనే వ్యక్తికి అతని తల్లి నుండి కిడ్నీని తీసుకుని నిర్వహించారు. ఇన్‌స్టిట్యూట్‌లోని అంకితమైన సర్జన్‌లు, యూరాలజిస్టులు, నెఫ్రాలజిస్టుల బృందంతో పాటు ఎయిమ్స్ న్యూఢిల్లీ నుండి నిపుణులైన సర్జన్లు డాక్టర్.వి.సీను, డాక్టర్.ఎ.కృష్ణ మార్పిడి కార్యక్రమానికి మార్గదర్శకత్వం వహిస్తున్నారని తెలిపారు. సెప్టెంబరు చివరలో, ట్రాన్స్‌ప్లాంట్ బృందం మరో రెండు ప్రత్యక్ష కిడ్నీ మార్పిడిని విజయవంతంగా నిర్వహించింది, డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాజోలు సమీపంలోని గ్రామానికి చెందిన కళ్యాణం గౌరీ ప్రసాద్ అనే ప్రైవేట్ ఉద్యోగి అతని తల్లి కె. దుర్గమ్మ నుండి కిడ్నీని పొందారు. 47 ఏళ్లు. త్రాసుల సాయి సూర్య ప్రకాష్ అనే మరో రోగి, దాదాపు 30 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, అతని తల్లి టి గోవర్ధని, 51 ఏళ్ల నుండి కిడ్నీ పొందాడని చెప్పారు. ఇంకా ఎయిమ్స్‌లోసంక్లిష్ట వ్యాధుల చికిత్స చేయడం జరిగిందని చెప్పారు. వివిధ ఇంటర్వెన్షనల్ రేడియాలజీ విధానాలు మరియు యాంజియోగ్రామ్ సేవలు కూడా ఇటీవలే ప్రారంభించడం జరిగిందని చెప్పారు. గత ఏడాది కాలంగా, ప్రత్యేకమైన పాలియేటివ్ కేర్ టీమ్ ఇంటి వద్దే తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు సమగ్రమైన సహాయాన్ని అందిస్తోంది తెలిపారు. ఇప్పటివరకు 19 లక్షల 32 వేల 329 మంది కి సేవలు అందించినట్లుగా తెలిపారు. మెడికల్ ఇన్నోవేషన్‌ను ముందుకు తీసుకెళ్లడం, రోగుల ఆరోగ్య ఫలితాలను మెరుగుపరచడం మరియు హెల్త్‌కేర్ డెలివరీలో కొత్త బెంచ్‌మార్క్‌లను సెట్ చేయడం కోసం ఇన్నిట్యూట్ తన లక్ష్యంలో స్థిరంగా ఉందని ఆయన తెలిపారు.

## ఇల్లు నరకంగా ఉంది..

**(మొదటిపేజీ తరువాయి)**

నరకంలా ఉంది.. నా చావుకు ఎవరూ కారణం కాదు. నా శవాన్ని ఎవ్వరికి దొరకనివ్వను..' అని రాసి ఉంది. రాములు నాగేంద్రమ్మ దంపతులకు మల్లికార్జునరావే ఏకైక సంతానం. అతనితోనే తల్లిదండ్రులు కూడా ఉంటున్నారు. మల్లికార్జునరావు పక్క గ్రామమైన నార్నెపాడు వీఆర్వోగా విధులు పని చేస్తున్నారు. ఇటీవలే బంధువుల అమ్మాయితో మల్లికార్జునరావుకు వివాహం చేశారు. పెళ్లి ఇష్టం లేకున్నా తల్లిదండ్రుల ఒత్తిడితో చేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. విద్యాధికుడైన మల్లికార్జునరావు గతంలో విదేశాలకు వెళ్లేందుకు వీసా కోసం ప్రయత్నించినట్లు తెలిసింది. గతంలో తల్లిదండ్రులు మందలిస్తే కొద్దిరోజులు ఇంట్లో నుండి వెళ్లిపోయేవాడని, ఇష్టమైన ప్రదేశాలు, దేవాలయాలకు వెళ్లి నాలుగు రోజుల వరకూ ఉండేవాడని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం ఫోన్‌కూడా ఇంట్లో వదిలి వెళ్లడమే కాకుండా చదువు, ఇతర ధ్రువపత్రాలనూ తీసుకుకెళ్లినట్లు సమాచారం. శ్రీశైలం వెళ్లాడనే సమాచారం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్లు ఎస్‌ఐ వి.సోమేశ్వరరావు తెలిపారు.

## లారీ ఢీకొని భవన నిర్మాణ కార్మికుడు మృతి

**(మొదటిపేజీ తరువాయి)**

చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పిడుగురాళ్లకు చెందిన భవన నిర్మాణ కార్మికులైన గోపాల్(40), గోపి నాయక్, చల్లా తిరుపతయ్య, స్వామి, కృష్ణ, నారాయణ దాచేపల్లి పట్టణంలో పినికి వెళ్లారు. పనులు ముగించుకొని పిడుగురాళ్లకు ట్రాక్టర్‌పై వస్తుండగా బ్రాహ్మణపల్లి వద్ద అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపై వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. గోపాల్ అక్కడికక్కడే మృతి చెందగా మిగతా వారికి గాయాలయ్యాయి. ఘటనా స్థలిని పోలీసులు పరిశీలించి క్షతగాత్రులను గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గోపీనాయక్, తిరుపతయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించిన పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం రూ.20 లక్షల పరిహారం ఇవ్వాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు కోరారు.

**ప్రజాశక్తి-ఈపూరు:** ఆర్టీసీ బస్సు ఢీకొనగా వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఇనిమెళ్లలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నరసరావుపేట డిపోకు చెందిన బస్సు నరసరావుపేట నుండి బొమ్మరాజుపల్లి వెళుతూ ఇనుమెళ్లలోకి వచ్చింది. అదే సమయంలో ఇంటిలో నుండి బయట రోడ్డుపైకి వచ్చిన గుంటుపల్లి పిచ్చయ్య (46)ను బస్సు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుణ్ణి నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కొద్దిసేపటికి మృతి చెందాడు. మృతుని భార్య శ్రీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.ఉమామహేశ్వరరావు తెలిపారు. మృతునికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉండగా వారికి పెళ్లిళ్లయ్యాయి. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

**ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ :** రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీని నలుగురు గాయపడిన ఘటన సత్తెనపల్లి మండలం పాకాలపాడు సమీపంలో గురువారం రాత్రి జరిగింది. సత్తెనపల్లి నుండి క్రోసూరు వెళుతున్న ఆటోను రెంటపాళ్ల నుండి సత్తెనపల్లి వస్తున్న ఆటో ఢీకొట్టడంతో దొడ్లేరుకు చెందిన షేక్ ఖాజావలి, కట్టమూరుకు చెందిన కుమారి, క్రోసూరుకు చెందిన గోవర్ధన్, ఆటో డ్రైవర్ అజయ్ కుమార్ గాయపడ్డారు. క్షతగాత్రులను సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడిన కుమారిని గుంటూరు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

## డిపాజిటర్ల నగదు గోల్‌మాల్

**(మొదటిపేజీ తరువాయి)**

ఆరోపిస్తున్నారు. దీనిపై నరసరావపేట డీఎస్పీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేపట్టారు. మరోవైపు బ్యాంకు జోనల్ మేనేజర్ సందిప్ మెహరా బ్రాంచికి చేరుకొని విచారణ చేస్తున్నారు. 70 మంది వరకూ బాధితులున్నారని తెలుస్తుండగా తమ వద్దకు 15 మంది వచ్చారని డీఎస్పీ తెలిపారు. వీరు దాదాపు రూ.6.5 కోట్ల వరకూ డిపాజిట్ చేసినట్లు ప్రాథమికంగా తేలిందని చెప్పారు.

**బాధితుల ఆవేదన..**

పొలం అమ్మగా వచ్చిన రూ.2.85 కోట్లను మూడేళ్ల క్రితం డిపాజిట్ చేశానని, ప్రతినెలా వడ్డీ జమవుతుండగా గత నెల జమ కాలేదని, ఏమిటా అని ఆరా తీస్తే ఇలా జరిగిందని 68 ఏళ్ల లలితాదేవి వాపోయారు. తాను రూ.40 లక్షలు ఫిక్స్ డిపాజిట్ చేశానని జి.లక్ష్మీదేవి చెప్పారు. రూ.30 లక్షలు వేసినట్లు బి.చంద్రశేఖర్, రూ.21.94 లక్షలు వేశానని 36 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఉద్యోగి షేక్ బాజి తెలిపారు. బంగారాన్ని తనఖా పెట్టి రూ.30 లక్షలు రుణం తీసుకుని దానితోపాటు మరో రూ.30 లక్షలు కలిపి రూ.60 లక్షలను డిపాజిట్ చేశానని షేక్ సుభాని వాపోయడు. ఈ మొత్తం కుంబకోణంలో బ్యాంక్ మేనేజర్, మరో ఉద్యోగి ముఖ్యకారకులని డిపాజిటర్లు అనుమానిస్తున్నారు.

## నేడు అసైన్డ్ రైతుల గ్రీవెన్స్

**సిఆర్‌డిఎ కార్యాలయానికి తరలి రావాలని సిపిఎం పిలుపు**

**ప్రజాశక్తి - తుళ్లూరు**

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు సి ఆర్ డి ఎ ప్రాంతీయ ఉప కార్యాలయంలో శుక్రవారం నిర్వహించే గ్రీవెన్స్ డే కు అసైన్డ్ రైతులు పెద్దఎత్తున తరలిరావాలని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి కోరారు. గురువారం తుళ్లూరులో రవి మాట్లాడుతూ, రాజధానిలోని పేదలైన అసైన్డ్ రైతులకు చెల్లించాల్సిన మూడు సంవత్సరాల కౌలును తక్షణమే చెల్లించాలని కోరుతూ గ్రీవెన్స్ సందర్భంగా అధికారుల వద్దకు సామూహిక రాయబారం నిర్వహించ నున్నట్లు రవి చెప్పారు. మూడు సంవత్సరాల నుండి కౌలు చెల్లించక పోవడంతో అసైన్డ్ రైతులు తీవ్రమైన ఆర్థిక సమస్యలతో కొట్టు మిట్టాడుతున్నారని చెప్పారు. నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక పలుమార్లు కౌలు చెల్లించాలని కోరుతూ అసైన్డ్ రైతులు అధికారులకు అర్జీలు అందజేసినప్పటికీ స్పందన కనిపించడం లేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సి ఆర్ డి ఎ అధికారులు స్పందించి తక్షణం అసైన్డ్ రైతులకు వార్షిక కౌలును వెంటనే వారి అకౌంట్లో జమ చేసేలా చర్యలు చేపట్టాలని రవి డిమాండ్ చేశారు.

## నేడు వైసిపి నేతలు బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి :** వైసిపి జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, గుంటూరు, నర్సరావుపేట లోక్‌సభ నియోజ కవర్గాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి శుక్రవారం సాయంత్రం 4 గంటలకు బాధ్యతలు స్వీకరిస్తారని పార్టీ నాయకులు తెలిపారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే పదవీ ప్రమాణ స్వీకార సభలో రాజ్యసభ సభ్యులు అయోధ్యరామిరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకష్ణారెడ్డి హాజరు అవుతారని తెలిపారు.

## అభివృద్ధి నామమాత్రం - పనులు నాసిరకం

**వైసిపి కార్పొరేటర్ల అసంతృప్తి - వార్డుల్లో సమ్యలపై కమిషనర్‌కు వినతి**

**ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి**

టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గుంటూరులో అభివృద్ధి నిలిచి పోయిందని వైసిపి కార్పొరేటర్లు అసంతప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో తమ డివిజన్లలో జరిగిన అభివృద్ధి నామమాత్రమని.. అంతంతమాత్రంగా జరుగుతున్న పనులు కూడా పూర్తిగా నాసిరకమని కార్పొరేటర్లు ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులకు మోక్షం కలగకపోవడంపై మండిపడ్డారు. పారిశుధ్యం పూర్తిగా క్షీణించిందని నిందించారు. గురువారం నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులును పలువురు కార్పొరేటర్లు కలిశారు. ఆయా డివిజన్లలో కుంటుపడిన అభివృద్ధిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కూడా కమిషనర్‌కు సమర్పించారు. బ్రాడీపేట 4వ లైన్ రోడ్డు విస్తరణ పనులు నిలిచి పోవడం పై అభ్యంతరం తెలిపారు. ఏటీ అగ్రహారంలో రోడ్డు విస్తరణ పనులు తూతూ మంత్రంగా సాగుతూ స్థానిక ప్రజలకు నరకయాతన కలిగిస్తున్నాయన్నారు. 43, 44, 45 డివిజన్ల ప్రజలకు ప్రధాన రహదారిగా ఉపయోగపడుతున్న 45వ డివిజన్ పరిధిలోని వైకుంఠ దామం రోడ్డుకు గత ప్రభుత్వ హయాంలో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పూర్తి నిర్లక్ష్య ధోరణితో ఇప్పటి వరకు వరకు పనులు ప్రారంభించలేదన్నారు. ముత్యాలరెడ్డినగర్ 8వ లైన్ రోడ్డు నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని దుండగులు ధ్వంసం చేశారని, తిరిగి దాన్ని నిర్మించాలని వారు కమిషనర్‌ను కోరారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన అన్ని పనులకు టెండర్లు పిలుస్తామని.. ఇప్పటికే టెండర్ దక్కించుకున్న పనులు త్వరితగతిన ప్రారంభం అయ్యేలా తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ వారికి తెలిపారు. పారిశుధ్యాన్ని పూర్తిగా మెరుగుపరిచి ఆయా డివిజన్ల అభివృద్ధికి అన్ని విధాలుగా తన సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. కమిషనర్‌ను కలిసిన వారిలో కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), షేక్ రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, కాంద్ర కుంట గురవయ్య, యక్కల మారుతి కోటి లింగారెడ్డి, బోడపాటి ఉషా కిషోర్, అడక పద్మా వతి, షేక్ జుమ్మాబి బాబు, వంగల హేమలత, పడాల సుబ్బారెడ్డి, అందుగుల సంతోష్, గోపి శ్రీనివాస్, ఉడుముల లక్ష్మీ శ్రీనివాసరెడ్డి, ఏరువ సాంబిరెడ్డి తదితరులు ఉన్నారు.

# ప్రియునితో కలిసి హత్య.. గుండెపోటుగా చిత్రీకరణ..

ప్రజాశక్తి - విజయపురిసౌత్

పవర్ గ్రిడ్ కాంట్రాక్టు ఉద్యోగి మృతి హత్య అని.. ప్రియుడుతో కలిసి భార్య హతమార్చిందని పోలీసులు తేల్చారు. ఈ మేరకు నిందితులిద్దర్నీ అరెస్టు చేసినట్లు తెలిపారు. గురువారం విజయపురిసౌత్‌లోని పోలీస్‌స్టేషన్‌లో వివరాలను మాచర్ల రూరల్ సిఐ నఫీజ్ బాషా, ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ వెల్లడించారు. మాచర్ల మండలం తాళ్లపల్లికి చెందిన ఓర్సు శివయ్య (32) స్థానిక పవర్ గ్రిడ్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఏడేళ్ల కిందటే గాయత్రితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు కాగా గాయంత్రికి అదే గ్రామానికి చెందిన సచివాలయ ఉద్యోగి ఆమ్మోరయ్యతో పెళ్లికి ముందే సాన్నిహిత్యం ఉంది. బంధువులైన వీరిద్దరూ పెళ్లి చేసుకుందామని భావించినా పెద్దలు అంగీకరించలేదు. ఈ క్రమంలో గత సోమవారం గాయంత్రి, అమ్మోరయ్య ఇద్దరూ కలిసున్న సమయంలో గాయత్రి భర్త శివయ్య చూశాడు. దీంతో గాయత్రి, అమ్మోరయ్య కలిసి శివయ్యను దిండుతో మొహంపై పెట్టి చంపేశారు. అనంతరం గుండెపోటుతో చనిపోయినట్లుగా చిత్రీకరించారు. దీనిపై అనుమానం వచ్చిన మృతుని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు దర్యాప్తు చేపట్టడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. నిందితులిద్దర్నీ కోర్టులో హాజరుర్చగా రిమాండ్ విధించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ సోమ్లా నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు.. వెనుక వరుసలో మాస్కులతో నిందితులు

## అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - తాడికొండ

రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచగా సివిల్ సప్లయాస్ డిటీ ఐ.అనిల్ ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు చేసి 46 బస్తాల బియ్యాన్ని గురువారం స్వాధీనం చేసుకున్నారు. నియోజకవర్గ కేంద్రమైన తాడికొండలోని బీసీ కాలనీలో ఖగ్గ శ్రీనివాసరావుకు చెందిన ఇంటిలో రేషన్ బియ్యాన్ని దాచారనే సమాచారంతో తనిఖీలు చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యాన్ని షాప్ నంబర్ 15 డీలర్‌కు భద్రత కోసం అప్పగించినట్లు వీఆర్వో మాల్యాద్రి తెలిపారు.

# కేంద్ర మంత్రి వద్దకు కోల్డ్‌స్టోరేజీ బాధిత రైతులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

కోల్డ్ స్టోరేజ్‌లో భద్రపరిచిన మిర్చి బస్తాలను దొంగతనంగా అమ్ముకోవడంపై పలువురు రైతులు గురువారం కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. కర్నూలు, ఆలూరు, నంద్యాల, బళ్లారి, మార్కాపురం, పల్నాడు ప్రాంతాలకు చెందిన మిర్చిరైతులు గుంటూరులోని నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలోగల ఓ కోల్డ్ స్టోరేజ్‌లో కొన్నాళ్ల క్రితం భద్రపరుచుకున్నారు. స్టోరేజ్‌కు చెందిన యజమాని నకిలీ వ్యక్తుల పేర్లు, ఆధార్ కార్డులతో రైతుల పేరిట లోన్లు తీసుకోవడమే గాక, పంటనూ అమ్ముకున్నారని రైతులు వాపోయారు. దీనిపై కేసు నమోదైనా పట్టించుకోవడంలేదని, తమకు న్యాయం చేయాలని కోరారు. మంత్రి స్పందిస్తూ ఎస్పి సతీష్ కుమార్‌కు, రుణాలు మంజూరు చేసిన బ్యాంకర్లకు ఫోన్ చేసి మాట్లాడారు. అధికారులను పిలిపించి వివరాలు సేకరించారు. రైతులకు న్యాయం చేయాలని ఆదేశించారు.

రైతుల సమక్షంలో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి

## సెలవులకు ఊరేళ్లేవారు పోలీసులకు చెప్పండి : ఎస్పీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దసరా సెలవులకు ఊరెళ్లాల్సి వస్తే ఇంటి భద్రతకు సంబంధించి పోలీసుల సూచనలు పాటించాలని పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు సూచించారు. భద్రతా సూచనలకు సంబంధించి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో లేదా ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోవాలని పేర్కొన్నారు. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్.హెచ్.ఎం.ఎస్) ఏపి పోలీస్ యాప్‌ను ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలని, ఊరేళ్లెటప్పుడు పోలీసులకు సమచారం ఇస్తే తిరిగొచ్చే వరకూ సిసి కెమెరా టెక్నాలజీ ద్వారా ఇంటిమీద నిఘా ఉంచుతామని తెలిపారు. ఎల్.హెచ్.ఎం.ఎస్ యాప్‌లో వివరాలు, చిరునామా, సెల్‌ఫోన్ నంబర్ వివరాలకు సంబంధించిన దరఖాస్తును భర్తీచేస్తే పోలీస్ శాఖ రిజిస్ట్రేషన్ యూనిక్ ఐడి ఇస్తారని పేర్కొన్నారు.

## సైబర్ నేరగాళ్లకు పోస్టర్‌తో చెక్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

దుగ్గిరాల మండలం ఈమనికి చెందిన వ్యక్తికి సైబర్ నేరగాళ్లు వల విసరగా అతను తెలివిగా వారి బారి నుంచి తప్పించుకున్నాడు. జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ కథనం ప్రకారం... ఈమని చెందిన వ్యక్తికి బుధవారం ఉదయం ఒక ఫేక్ ఫోన్ కాల్ వచ్చింది. ఫోన్ కాల్ ద్వారా సైబర్ నేరగాళ్లు తాము సిబిఐలో పని చేస్తున్నామని, నీ కూతురు మనీ లాండరింగ్‌కు పాల్పడిందని, అరెస్టు చేయకుండా ఉండాలంటే డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో ఫోన్‌కాల్ అందుకున్న వ్యక్తి దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించారు. స్టేషన్ ఆఫీసర్ రవి సలహాతో 'డిజిటల్ అరెస్టు స్కామ్‌తో జాగ్రత్త' అనే ఎస్పీ పోస్టర్ ప్రకటనను సైబర్ నేరగాళ్లకు పంపగా వారు వెంటనే ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేసుకున్నారు.

# మద్యం నూతన విధానంలో ఫ్రెండ్లీ అప్లికెంట్

## దరఖాస్తు ప్రక్రియను పరిశీలించిన ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిరబ్ కుమార్

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మద్యం నూతన విధానం నేపథ్యంలో కొత్తగా దుకాణాల ఏర్పాటుకు చేపట్టిన దరఖాస్తుల ప్రక్రియను నియోజవకర్గ కేంద్రమైన ప్రత్తిపాడులోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఆ శాఖ కమిషనర్ నీరబ్‌కుమార్ గురువారం పరిశీలించారు. లాటరీ విధానం పారదర్శకంగా జరుగుతోందని, దరఖాస్తుదార్లకు ఇబ్బందులేమీ లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఎవ్వరైనా, ఎక్కడి నుండైనా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. లైసెన్స్ ప్రక్రియ, వెబ్‌సైల్, నూతన మద్యం విధానంపై ప్రజలకు అవగాహన కోసం కార్యాలయం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు.

### 21 ఏళ్లు దాటితే దరఖాస్తు చేసుకోవచ్చు

డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ 21 ఏళ్లు దాటిన ఎవ్వరైనా దరఖాస్తు చేసుకుని లాటరీలో పాల్గొనొచ్చని చెప్పారు. కార్యాలయంలో ప్రత్యేకంగా 3 కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. గుంటూరు జిల్లాలో మొత్తం127 మద్యం షాపులు, పల్నాడు జిల్లాలో 129 మద్యం షాపులకు దరఖాస్తులు తీసుకోనున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్‌లో చలానా కడితే ఆటోమేటిక్‌గా అప్లికేషన్ అప్లయ్ అవుతుందని, ఇందులో రాజకీయ ప్రమేయం ఉండదని, ఫ్రెండ్లీగా అప్లికేషన్ పెట్టుకోవచ్చని చెప్పారు. దరాఖాస్తు ప్రక్రియ ముగిసిన తర్వాత గుంటూరు జిల్లా వారికి గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కలెక్టర్ సమక్షంలో లాటరీ తీస్తారని చెప్పారు. పరిశీలనలో డీఎస్పీ మరియబాబు, సిఐ అశోక్ కుమార్, ఎస్ఐ రవీంద్రబాబు పాల్గొన్నారు.

## రైలు పట్టాలపై ఇద్దరి మృతదేహాలు

**ప్రజాశక్తి-పిడుగురాళ్ల :** రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని తుమ్మలచెరువులో గురువారం చోటుచేసుకుంది. తుమ్మలచెరువు సమీపంలోని రైల్వేట్రాక్‌పై ఒకరు మృతి చెంది పడి ఉన్నారని, మృతుని వయస్సు 50-60 ఏళ్లుంటుందని రైల్వే పోలీసులు తెలిపారు. ఒంటిపై తెల్లటి చొక్కా, లుంగి, టవల్ ఉన్నాయని, మృతునికి గతంలో కాలు లోపల రాడ్డు ఉన్నందున గతంలో వైద్యం జరిగినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. వివరాలు తెలిసిన వారు స్థానిక రైల్వే అధికారులను సంప్రదించాలని కోరారు.

**ప్రజాశక్తి - తెనాలి :** స్థానిక రైల్వేస్టేషన్లో 4వ నంబరు ప్లాట్ఫారంపై వృద్ధుని మృతదేహాన్ని రైల్వే పోలీసులు గురువారం గమనించారు. మృతునికి సుమారు 60 ఏళ్లు ఉంటాయని భావిస్తున్నారు. మృతుని ఒంటిపై ఆకుపచ్చ, తెలుపు నలుపు రంగుల లుంగి కలిగి ఉన్నాడని, తెలిసినవారు తెనాలి జిఆర్‌పి పోలీస్ వారికి 9440727554 నంబరుకు సమాచారం ఇవ్వాలని జిఆర్‌పి ఎస్ఐ వెంకటాద్రి కోరారు.

### మిర్చి నిల్వలు

బ్యాగులు

| | |
|---|---|
| మిర్చి దిగుమతి | : 54,870 |
| మిర్చి ఎగుమతి | : 53,641 |
| మిర్చి నిల్వ | : 26,718 |

### మిర్చి ధరలు

రూపాయలలో

| | |
|---|---|
| 334 | 8,000 - 16,000 |
| నెం.5 | 8,500 - 15,500 |
| 273 | 11,300 - 13,500 |
| 341 | 8,000 - 15,000 |
| 4884 | 12,500 - 12,500 |
| నాన్ ఎసి | |
| తేజ | 9,000 - 18,600 |
| బడిగి | 9,000 - 15,000 |
| దేవనూరు డీలక్స్ | 10,000 - 15,000 |
| తాలుకాయలు | 5,000 - 11,500 |
| ఎసి | |
| 334 | 9,000 - 16,000 |
| నెం.5 | 10,000 - 11,000 |
| 273 | 13,000 - 13,000 |
| 341 | 9,500 - 16,500 |
| 4884 | 12,000 - 13,000 |
| తేజ | 9,500 - 18,500 |
| బడిగి | 9,500 - 14,000 |
| దేవనూరు డీలక్స్ | 9,000 - 16,000 |
| తాలుకాయలు | 5,000 - 11,000 |

**IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) :: TENALI**
**I.A. NO. 396/2023 IN O.S. NO. 15/2022**

Between:
Tadiboyina Rajesh ... Petitioner/Plaintiff
And
Tadiboyina Rajya Lakshmi (Died) & others ... Respondents/Defendants
**(R3)** Tadiboyina Siva Naga Vara Prasad S/o. Seetharamaiah (Late), R/o. 7th Line, Telecom Nagar, Amaravathi Road, Guntur, Guntur District

పై నెంబరు పిటీషనులో పై తెల్పిన 3వ రెస్పాండెంట్‌కి పైశ్రీకోర్టువారి ద్వారా పంపిన ఐ.ఏ. నోటీసులను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు సబ్‌స్టిట్యూట్ ఉత్తర్వుల ప్రకారము ది. 21-10-2024వ తేదీ ఉదయం గం.10-30 నిమిషములకు శ్రీ కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు ఏమైనా వున్నచో తెలుపగలరు. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానం చేయబడును.

**దిండు శ్రీనివాస్ B. Com, B.L.,**
**పిటీషనరు తరుపున న్యాయవాది, తెనాలి.**
**సెల్ నెం : 9849229704.**

**IN THE HONOURABLE COURT OF THE VII SPECIAL MAGISTRATE AT VISAKHAPATNAM**
**STC 4936/2023**

**Between:**
**Katari Ravi Krishna** ...Complainant
**And:**
**P Malyadri** ...Accused

**NOTICE**

To,
Accused:
**P Malyadri, S/o Malakondaiah, Hindu, aged 62 years, residing at Flat No.404, R.K Ramya Enclave, Mangalagiri, Guntur Disrtict.**

Please take notice that the above named Complainant filed the above Petition against you and the matter stands posted to 17-10-2024 for your appearance. Therefore, you are hereby required to appear before the Honourable Court either in person or through duly instructed Advocate on 17-10-2024 at 10:30 AM in the above court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence.

**(By Order of the Hon,ble Court)**

**J.V.RAGHAVENDRA RAO**
**ADVOCATE**
**VISAKHAPATNAM, Ph:9440287526**

**NOTICE**
**IN THE COURT OF THE HONORABLE ADDITIONAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT NARASARAOPET**
**I.P. No. 38/2024**

Between :
Annapareddy Ramana, W/o. Saida (Late) D.No. 30-51, Gundaiah Thota, Chilakaluripet, Palnadu Dist ...- Petitioner
and
1. Thanniru Krishna, S/o. Govind, Raise peta, Charla Mandal, Khammam Dist, Telangana
2. Annapareddy Sailaja, W/o. Basha, Gundaiah Thota, Chilakaluripet, Palnadu Dist
3. Thadipathri Padma, W/o. Srinivas, Lecturers Colony, Chilakaluripet, Palnadu Dist
4. Thalamala Bhavani, W/o. Gandhi, Ragannapalem, Chilakaluripet, Palnadu Dist ....- Respondents

పై నెంబరు ఐ.పి.లోని పిటీషనరు తనను ఇన్సాల్వెంట్గా డిక్లేర్ చేయమని దాఖలు చేసిన పిటీషనులో రెస్పాండెంట్లు అయిన మీరు మరియు ఇంకా ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న యెడల ఈ వార్తా పత్రిక ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టువారు తేది. 17-10-2024 కి వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉదయం గం. 10-30 ని॥ లకు పై కోర్టువారి యెదుట స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో శ్రీ కోర్టువారిచే మీ పరోక్షముగా తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం)

**వాయిదా తేది.17-10-2024**

**జడ పీటర్ పాల్,**
**పిటీషనర్ తరపు అడ్వకేట్,**
**చిలకలూరిపేట**
**సెల్ నెం.9676074671**

**దస్తావేజు పోయినవి**

పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణ కాపురస్తురాలు యక్కంటి వెంకట్రావమ్మ భర్త యక్కంటి సాంబిరెడ్డికి చెందిన వ్యవసాయ భూమికి సంబంధించిన దస్తావేజు పోయినవి. పెదకూరపాడు గ్రామంలో డి నెం 372-బి లోయ. 1.00 సెంట్ల వ్యవసాయ భూమికి సంబంధించి సత్తెనపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ కాబడిన దస్తావేజు నెం 732/ 07-04-1980 పోయినది. 5-9-2024 తేదీన సత్తెనపల్లి మండలం పెదమక్కెన గ్రామం నుండి ఆటోలో సత్తెనపల్లి వస్తుండగా మార్గమధ్యంలో పోయినది. దొరికిన వారు ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

**ఇట్లు**
**యక్కంటి వెంకట్రావమ్మ**
**భర్త యక్కంటి సాంబిరెడ్డి**
**సత్తెనపల్లి, పల్నాడు జిల్లా**

**ఒరిజినల్ దస్తావేజు పోయినవి**

గుంటూరు జిల్లా, తాడికొండ మండలం తాడికొండ గ్రామ నివాసి,వంగల రామ బ్రహ్మ శాస్త్రి (లేట్ ) గారి కుమారుడు వంగల వెంకట జగన్ మోహన్ కృష్ణ శాస్త్రి కు ఉన్న క్రింది వివరములతో కూడిన ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. తేది. 29-09-2024 న నేను మా ఇంటి నుండి బైక్ పై తాడికొండ నుండి లాం గ్రామ వెళుతుండగా మార్గ మధ్యలో ఒరిజినల్ దస్తావేజుల కవర్ పోయినది. ఆ కవర్ నందు తాడికొండ సబ్ రిజిస్టర్ వారి కార్యాలయంలో రిజిస్టర్ కాబడిన ద.నెం 677/1969,685/1972 యొక్క ఒరిజినల్ దస్తావేజు పోయినవి. సదరు ఒరిజినల్ దస్తావేజులు దొరికిన వారు ఈ క్రింది చిరునామాకు గాని, ఫోన్ నెంబరుకు గాని తెలియపరచవలసినదిగా - కోరుతున్నాను.

**ఇట్లు**
**వంగల వెంకట జగన్ మోహన్ కృష్ణ శాస్త్రి**
**s/o వంగల రామ బ్రహ్మ శాస్త్రి**
**డోర్ నెం 14-101/3 తాడికొండ గ్రామం**
**తాడికొండ మండలం. ఫోన్ నెం : 9398975698**

## కుడికాల్వకు నీటి విడుదల పరిశీలన

**ప్రజాశక్తి - విజయపురిసౌత్**

నాగార్జున సాగర్ ప్రాజెక్టు కుడికాల్వ ద్వారా విడుదలవుతున్న సాగు నీటిని ఇరిగేషన్ అధికారులు గురువారం పరిశీలించారు. కుడికాల్వకు ఇప్పటివరకు 10,000 క్యూసెక్కులు విడుదల అవుతుండగా గురువారం 500 క్యూసెక్కుల నీటిని పెంచారు. అనంతరం కుడి కాల్వ గేజ్ రీడింగ్‌ను పరిశీలించారు. సాగర్ ప్రాజెక్ట్ గేట్స్ డిఇ మురళీధర్ మాట్లాడుతూ సాగర్ జలాశయానికి ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో కుడికాల్వకు నిరంతరాయంగా నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరిశీలనలో మెయిన్ కెనాల్ మోనిటరింగ్ ఏఈఈ వెంకట సుబ్బయ్య, సాగర్ ప్రాజెక్ట్ గేట్స్ ఏఈఈ అనితశ్రీ పాల్గొన్నారు.

## కులాంతర వివాహాలు చేసుకుంటే బహిష్కరణ

### దురాచారాలకు వీల్లేకుండా గ్రామసభలు నిర్వహించాలంటున్న దంపతులు

**ప్రజాశక్తి - అచ్చంపేట**

కులాంతర వివాహాలు చేసుకుంటే కుల బహిష్కరణలు చేయటం సరికాదని ఈ అంశాలపై ప్రజలకు అవగాహన కోసం గ్రామసభలు ఏర్పాటు చేయాలని మండలంలోని చెరుకుంపాలేనికి చెందిన కత్తుల గోపి కృష్ణారెడ్డి, నాగ సంధ్య దంపతులు కోరుతున్నారు. బీసీ, ఎస్సీ సామాజిక తరగతులకు చెందిన తాము 8 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నామని, ఇది నచ్చని కుల పెద్దలు తమ కుటుంబాన్ని బహిష్కరించారని గోపికృష్ణారెడ్డి తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడంతో కోర్టును ఆశ్రయించడంతో కుల పంచాయితీలు ఆగిపోయాయని చెప్పారు. అయితే కొంతకాలంగా మళ్లీ గ్రామంలో కుల బహిష్కరణ జరుగుతున్నాయని, వీటివల్ల పిల్లల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం ఉంటుందని ఆందోళన వెలిబుచ్చారు. ఇటువంటి వాటిపై ప్రభుత్వం, అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా కులాంతర వివాహాలు చేసుకున్న వారికి రూ.లక్షల్లో జరిమానాలు విధిస్తున్నారని, వీటిని చెల్లించిన వారికి బహిష్కరణ అమలు చేయడం లేదని, డబ్బు ఇవ్వని వారినే బహిష్కరించడమో, ఇతర రూపాల్లో ఇబ్బందులు పెట్టడమో చేస్తున్నారని తెలిసింది.

## యువజన క్రీడల్లో ఎఎం రెడ్డి స్మారక ఫార్మసీ కళాశాల విద్యార్థుల సత్తా

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

నరసరావుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన యువజన క్రీడల్లో తమ కళాశాల విద్యార్థులు కబడ్డీలో ప్రథమ స్థానం సాధించారని ఎఎంరెడ్డి స్మారక ఫార్మసీ కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నరసరావుపేట మండలంలోని పెట్లూరివారిపాలెంలోని కళాశాలలో గురువారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థికి మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ఉల్లాసం, ధృఢత్వం ఎంత అవసరమని చెప్పారు. క్రీడలలో పాల్గొనడం ద్వారా ఇవి వస్తాయన్నారు. తమ కాలేజీలో క్రీడలకూ ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.భార్గవ్ భూషణ్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

# కుట్రలు మానుకుని గనులు కేటాయించాలి

### ముగిసిన విశాఖ ఉక్కు సత్యాగ్రహ దీక్షలు

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

విశాఖ ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించి ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ప్రకటించాలని రైతుసంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శులు ఏపూరి గోపాలరావు, యు.రాము డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం పల్నాడు జిల్లా కేంద్రన నరసరావుపేట పట్టణం గాంధీ పార్క్ వద్ద ధర్నా చౌక్‌లో చేపట్టిన మూడ్రోజుల రిలేదీక్షలు గురువారం ముగిశాయి. దీక్షలకు సంఘీభావం తెలిపిన గోపాలరావు, రాము తొలుత విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం సాగిన ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ 32 మంది ప్రాణ త్యాగంతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను బిజెపి ప్రభుత్వం అడ్డదారిలో ప్రైవేటీకరణకు పూనుకుందని విమర్శించారు. ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం కానివ్వబోమని ప్రతిపక్షంలో ఉండగా ప్రకటించిన టిడిపి, జనసేన ఇప్పుడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు పరిశ్రమను స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్' (సెయిల్)లో విలీనానికి బిజెపి చేస్తున్న ఆలోచనలు విరమించుకోవాలన్నారు. 4,290 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడానికి ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. మరోవైపు 2,500 మంది కార్మికులను విఆర్ఎస్ ఇస్తామంటూ ప్రచారం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.రామారావు, మండల కార్యదర్శి కె.ఆంజనేయులు, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.రోశయ్య, కె.నాగేశ్వరరావు, సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి, ఎఐటియుసి నాయకులు కె.రాంబాబు, నాయకులు బి.నాగేశ్వరరావు, టి.బాబూరావు, సత్యనారాయణ రాజు, సురేష్ పాల్గొన్నారు.

నరసరావుపేటలో దీక్షలు, పిడుగురాళ్లలో నిరసన తెలుపుతున్న సంఘాలు

**ప్రజాశక్తి-పిడుగురాళ్ల**

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని, అక్రమంగా తొలగించిన 4వేల కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ గురువారం పిడుగురాళ్లలోని బ్యాంక్ సెంటర్లో వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆనాడు విశాఖ ఉక్కు నిర్మాణం కోసం 28 వేల ఎకరాల భూములు రైతులు ఇచ్చారని, వారికి ఇప్పటికీ పరిహారం కానీ, వారి పిల్లలకు ఉద్యోగాలు కానీ ఇవ్వలేదని విమర్శించారు. 32 మంది ప్రాణ త్యాగం, 68 మంది ఎమ్మెల్యేలు మూకుమ్మడిగా రాజీనామా నేపథ్యంలోనే విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని నిర్మించారని గుర్తు చేశారు. ఈ ఫ్యాక్టరీని అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు కట్టబెట్టడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుందని, దీన్ని వ్యతిరేకిస్తూ నాలుగేళ్లుగా కార్మికులు, ఉద్యోగులు దీక్షలు చేస్తున్నారని చెప్పారు. అయినా రాష్ట్రంలో కూటమి పార్టీలైన టిడిపి, జనసేన, ప్రతిపక్ష వైసిపిలు మోడీకి దాసోహమై నోరు మెదపడం లేదని మండిపడ్డారు. రైతుకూలి సంఘం నాయకులు ఎన్.రాంబాబు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగసంస్థల అమ్మకానికి పూనుకుందని, కార్మిక, రైతుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించాలన్నారు. ఎఐటియుసి నాయకులు జె.కృష్ణానాయక్ మాట్లాడుతూ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు ఆలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉద్యమాలతోనే బుద్ధి చెబుతామని హెచ్చరించారు .సిటియు నాయకులు ఓర్సు కృష్ణ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడుతున్న వారిపై ప్రభుత్వాలు నిర్బంధాలు అమలు చేస్తున్నారని, అణచివేతలతో ఉద్యమాలు ఆపలేరని అన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.వెంకటేశ్వర్లు, జి.నాగేశ్వరరావు, సిహెచ్.కోటేశ్వరరావు, వెంకటప్పయ్య, కె.వెంకటేశ్వరమ్మ, సుజాత, వెంకటస్వామి, సైదా, కృష్ణ పాల్గొన్నారు.

## మాచర్లలో భారీ వాన

**ప్రజాశక్తి - మాచర్ల రూరల్ :** వారం రోజులుగా ఎండలతో అల్లాడిన మాచర్ల ప్రజలను గురువారం కురిసిన భారీ వర్షం సేద తీర్చింది. పట్టణంలో సాయంత్రం 5 గంటల నుండి షుమారు గంటకు పైగా భారీ వర్షం కురిసింది. అనంతరం జల్లులతో కూడిన వాన కొనానాగింది. వానతో రహదారులన్ని జలమయ అయ్యాయి. డ్రెయినేజీ కాల్వలను సరిగా పూడిక తీయని నేపథ్యంలో వర్షపునీటికి మురుగునీరు తోడై రోడ్లపైకి ప్రవహించడంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. ఇదిలా ఉండగా భారీ వర్షానికి పట్టణంలోని ప్రధాన రహదారిపై భారీ చెట్టు కూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మున్సిపల్ ఛైర్మన్ పి.నరసింహారావు అక్కడికి చేరుకొని సిబ్బంది ద్వారా తొలగింపజేశారు. మరోవైపు చుట్టుప్రక్కల గ్రామాల్లోనూ వర్షంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## స్కేటింగ్ పోటీల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి - క్రోసూరు :** యూత్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా ఒంగోలు ఇటీవల జరిగిన స్కేటింగ్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని సెయింట్ ఆన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మేరీ రజిత గురువారం తెలిపారు. అండర్-11 విభాగం 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లలో మన్యం జ్ఞానేశ్వర్ ప్రథమ స్థానం సాధించారని, 600 మీటర్లలో తృతీయస్థానం, 800 మీటర్లలో ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. అండర్-17 విభాగం 600 మీటర్లు, 800 మీటర్లలో ఆత్మకూరి నరేంద్ర ద్వితీయ స్థానంలో నిలిచారని, సుంకిశాల జాకిచాన్ 600 మీటర్లు, 800 మీటర్లలో తృతీయ స్థానం దక్కించుకున్నారని తెలిపారు. అండర్-14 200 మిటర్లలో సుంకిశాల జాహ్నవి ద్వితీయ స్థానం, 400 మీటర్లలో తృతీయ స్థానం, 800 మీటర్లలో ప్రథమ స్థానం సాధించినట్లు చెప్పారు. అండర్-11 200 మీటర్లలో గంజిమాల శైల ద్వితీయ స్థానం, 600 మీటర్లలో తృతీయ స్థానం, కె.శాన్వి ఫ్లోరెన్స్ 600 మీటర్లలో ద్వితీయ స్థానం దక్కించుకున్నట్లు వివరించారు. అండర్-17 విభాగం 200 మీటర్లలో మద్ది లలితాంబిక ద్వీతీయ స్థానం సాధించారన్నారు. వీరికి ప్రిన్సిపాల్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

# అమృత్ పనులను త్వరగా పూర్తిచేయాలి : కలెక్టర్

### వరికపూడిశెల నిర్మాణం, విద్యాసంస్థల ఏర్పాటుతోనే పల్నాడులో స్వర్ణాంధ్ర-2047 సాధనకు తొలి అడుగులు : ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

సమీక్షలో కలెక్టర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

అమృత్ పథకంలో భాగంగా మొదటి, రెండు దశల పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో ప్రజా ప్రతినిధులతో కలిసి కలెక్టర్ గురువారం సమీక్షించారు. నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలో మొదటి దశ కింద రూ.13.53 కోట్లతో చేపట్టిన పనులు 99 శాతం, చిలకలూరిపేట మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సరఫరా రూ.8.82 కోట్లతో చేపట్టిన పనులు 94 శాతం పూర్తయ్యాయని తెలిపారు. నరసరావుపేట, చిలకలూరిపేట ప్రాంతంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, నీటి సరఫరాకు సంబంధించి రూ.153 కోట్ల తో చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పల్నాడు జిల్లా సమగ్ర అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబుకు పలు సూచనలు చేశారు. వరికపూడిసెల ప్రాజెక్టు పనులు తక్షణమే ప్రారంభించాలని, ఈ ప్రాజెక్టు పూర్తయితే 100 గ్రామాలకు తాగునీరు, లక్ష ఎకరాలకు పైగా సాగునీరు అందుతుందని, పల్నాడు ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని చెప్పారు. వినుకొండ నియోజకవర్గంలో ఉద్యాన కళాశాల, మాచర్లలో యూనివర్సిటీ అండ్ పిజి సెంటర్, కారంపూడిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, నరసరావుపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. వీటి ద్వారా అక్షరాస్యత పరంగా వెనుకబడిన పల్నాడు జిల్లాలో అక్షరాస్యత శాతం మెరుగుపడుతుందన్నారు. పిడుగురాళ్లలో నిర్మాణ దశలో ఉన్న మెడికల్ కళాశాల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. సిఎం చంద్రబాబు చెబుతున్న స్వర్ణాంధ్ర-2047 విజన్‌కు తొలి అడుగులు వెనుకబడిన పల్నాడు జిల్లాలో పడడం ద్వారా ప్రజల్లో విశ్వాసం ఏర్పడేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం వివిధ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జీవీ ఆంజనేయులు, కన్నా లక్ష్మీనారాయణ, జూలకంటి బ్రహ్మానందరెడ్డి చర్చించారు. పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, సిపిఒ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మూడవ రోజుకు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి దీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా వరుసగా మూడవరోజు గుంటూరు కలెక్టరేట్ ఎదుట రైతుసంఘాల ఆధ్వర్యంలో నిరసన దీక్ష నిర్వహించారు. ఈదీక్షలను రిటైర్డ్ వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాలరావు, నల్లమడ రైతుసంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్ దీక్షాపరులకు పూలమాలలు వేసి ప్రారంభించారు. రైతు సంఘాల నాయకులు కంచుమాటి అజయ్‌కుమార్, కొల్లి రంగారెడ్డి అధ్యక్షతన దీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వేణుగోలరావు, కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ గత రెండేళ్లుగా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుండి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం అవుతుందన్నారు. కానీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మొండిగా పథకం ప్రకారం కుట్ర పూరితంగా ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తుందని విమర్శించారు. 32 మంది ఆత్మబలిదానం, వేల మంది త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును బిజెపి ప్రభుత్వం ప్రవేట్ పరం చేయాలని చూస్తుందన్నారు. దేశంలోని అన్ని స్టీల్ ప్లాంట్లకు సొంత గనులు కేటాయించి, విశాఖ ఉక్కుకు మాత్రం కేటాయించలేదన్నారు. ఉద్దేశపూర్వకంగానే ఉత్పత్తిని తగ్గించడం, కాంట్రాక్టు ఉద్యోగుల తొలగింపు వంటి చర్యలు చేపట్టిందన్నారు. ప్రైవేటీకరణ విధానాలు ఉపసంహరించుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఫ్యాక్టరీని ప్రైవేటీకరిస్తే దాదాపు లక్ష మంది ఉపాధిపై ప్రతికూల ప్రభావం చూపిస్తుందన్నారు. ప్రైవేటీకరణ విధానాలను అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం, ప్రతిపక్షాలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. లేదంటే భవిష్యత్‌లో మరింత ఉధృతంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. దీక్షల్లో రైతుకూలీ సంఘం నాయకులు యు.నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు ఈమని అప్పారావు, ఈశ్వరరావు, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు భాషా, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కృష్ణకాంత్, కౌలు రైతు సంఘం నాయకులు జగన్నాధం, సిఐటియు నాయకులు కె.శ్రీనివాస్, ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షులు రాధాకృష్ణమూర్తి, ఎఐఎఫ్‌టియు నాయకులు కోటయ్య, మహిళా నాయకులు కుమారి, రైతు సంఘం నాయకులు పచ్చల శివాజీ, కౌలు రైతు సంఘం నాయకులు విఠల్‌రెడ్డి, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చైతన్య తదితరులు పాల్గొని ప్రసంగించారు.

గుంటూరు కలెక్టరేట్ వద్ద దీక్షల్లో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

## టిడ్కో రుణాలను రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి ప్రాంతంలోని టిడ్కో గృహ లబ్ధిదారుల బ్యాంకు రుణాలను రద్దు చేయాలని సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. పేదలైన టిడ్కో గృహ లబ్ధిదారులకు రాజధానిలో వ్యవసాయ పనులు లేకుండా పోయాయని, ఉపాధి అవకాశాలు మృగ్యమయ్యాయని సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ కార్యదర్శి ఎం రవి అన్నారు.రాజధాని లోని మందడం టిడ్కో గృహ సముదాయాల వద్ద గురువారం సిపిఎం టిడ్కో శాఖ మహాసభ జరిగింది. సభలో రవి మాట్లాడుతూ,పనులు లేక, ఉపాధి దొరక్క తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్న టిడ్కో లబ్ధిదారులు బ్యాంకు రుణాలు ఎలా తీర్చగలుగుతారని ప్రశ్నించారు. రుణాల రద్దుపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్ చార్జీల పెంపు యత్నాలను ప్రభుత్వం మానుకోవాలన్నారు. ఇసుకను ఉచితంగా సరఫరా చేయాలన్నారు. టిడ్కో గృహాల లోకి రాకపోకలు సాగించేం దుకు వీలు లేకుండా నీరు ప్రవహిస్తున్న రోడ్డును యుద్ధ ప్రాతిపదికన పునర్నిర్మించాలని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, నాయకులు చేవూరి నందాజీ అధ్యక్షతన జరిగిన మందడం టిడ్కో సిపిఎం శాఖా మహాసభ తీర్మానం చేసింది. మహాసభలో మందడం టిడ్కో శాఖ కార్యదర్శిగా కుంభా ఆంజనేయులు ఎన్నికయ్యారు. మహాసభలో నాయకులు గడ్డం కృష్ణ, చేవూరి లక్ష్మయ్య, పొట్లూరు వెంకటేష్, భవాని శంకర్, అంకమ్మరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి

# 7 నుండి వీణా అవార్డ్స్ జాతీయ స్థాయి నాటకోత్సవాలు

### వివరాలు వెల్లడించిన సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్

**ప్రజాశక్తి-తెనాలి :** వీణా అవార్డ్స్ జాతీయ స్థాయి పద్య, సాంఘిక నాటక, నాటిక పోటీలు ఈనెల 7 నుంచి 12 వరకూ నిర్వహించ నున్నట్లు సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్ చెప్పారు. పట్టణానికి చెందిన కళల కాణాచి, విజయవాడలకు చెందిన వేదగంగోత్రి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే పోటీల వివరాలపై స్థానిక కళల కాణాచి సంస్థ కార్యాలయంలో గురువారం మాట్లాడారు. సమకాలీన సాంఘిక పద్యనాటక పోటీలు, సాంఘిక నాటక, నాటిక పోటీలను మూడు విభాగాలుగా విభజించి నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించే పోటీల సందర్భంగా ఈ ఏడాది శతజయంతి జరుపుకుంటున్న రంగస్థల రారాజు, మాయల ఫకీర్ ఫేమ్ వల్లూరి వెంకట్రామయ్య చౌదరి, రంగజీవి కన్నెగంటి నాసరయ్య, శతాధిక నాటక కర్త గొడాలి గోపాలరావు, అమరకవి బెల్లంకొండ రామదాసు పై నాటకోత్సవాల్లో తొలిరోజు 7న సదస్సు నిర్వహించి, వారి పేరున కళారంగంలో ప్రముఖులకు పురస్కారాలు అందిస్తామన్నారు. ఎనిమిదో తేదీ నుంచి ప్రతి రోజు ఉదయం 10.30 గంటలకు పద్య నాటకం, మద్యాహ్నం రెండు గంటలకు సాంఘిక నాటకం, రాత్రికి రెండు సాంఘిక నాటకల ప్రదర్శన ఉంటుందన్నారు. నాట కోత్సవాల ముగింపు సందర్భం గా 12 సాయంత్రం ఆరు గంటలకు బుర్రా సుబ్రహ్మ ణ్యశాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారాన్ని విజయనగరంకు చెందిన ప్రముఖ రంగస్థల పౌరాణిక నటులు యడ్ల గోపాలరావుకు అందించ నున్నట్లు సాయిమాధవ్ చెప్పారు.

### ప్రదర్శనల వివరాలు

ఈనెల 8న 10.30 గంటలకు శ్రీ కళానికేతన్ హైదరాబాద్ వారి 'సంజ వెలుగు', మద్యాహ్నం 2 గంటలకు చైతన్య కళాస్రవంతి విశాఖపట్నం వారి 'మంత్ర నగరి' నాటకాలు, సాయంత్ర 6.45 గంటలకు అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి 'చిగురు మేఘం', రాత్రి 8.15కు వెలగలేరు ఆర్ట్స్ థియేటర్ వారి 'నిశి' సాంఘిక నాటిక ప్రదర్శనలుంటాయి. అలాగే 9న ఉదయం పెదకాకాని గంగోత్రి వారి 'అష్టమ పసుపు', మద్యాహ్నం విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హదరాబాద్ వారి 'స్వేచ్ఛ', సాయంత్రం చీరాల పూర్ణోదయ ఆర్ట్స్ "నేనేం చేసుకుంటాను', రాత్రి రసఝరి పొన్నూరు వారి 'గురి తప్పిన వేట' నాటికలు, 10న ఉదయం కళాంజలి హైదరాబాద్ వారి 'యుద్ధం', మద్యాహ్నం విజయవాడ యంగ్ థియేటర్ ఆర్ట్స్ వారి '27వ మైలు రాయి', సాయంత్రం మిత్ర క్రియేషన్స్ హైదరాబాద్ వారి 'ఇది రహదారి కాదు', రాత్రి చిలకలూరిపేట మద్దుకూరి ఆర్ట్స్ వారి 'మా ఇంట్లో మహాభారతం', 11న ఉదయం వరంగల్ స్టార్ బ్రదర్స్‌వారి 'చాంద్ సూరజ్' మద్యాహ్నం గుంటూరు అభినయ ఆర్ట్స్ వారి 'ఇది అతని సంతకం', సాయంత్రం శ్రీకాకుళం లలితశ్రీ కళాసమితి వారి 'మతమా మానవత్వమా', రాత్రికి హైదరాబాద్ యువభేరి ఆర్ట్స్ ఆర్గనైజేషన్ వారి 'నా శత్రువు', 12న మద్యాహ్నం 2 గంటలకు వెలగలేరు ఆర్ట్స్ థియేటర్ వారి 'హరిలో రంగ హరి', సాయంతర్ం 5 గంటలకు వీరన్నపాలెం వారి 'ఋతువులేని కాలం' నాటిక ప్రదర్శనలుంటాయి.

## దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - తెనాలి

పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవాలయంలో దసరా నవరాత్రుల సంబరాలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు బాలా త్రిపురసుందరి అలంకారంలో భ్రమరాంబ అమ్మవారు భక్తులను దర్శనమిచ్చారు. ఉత్సవాల సందర్భంగా ఆలయం ప్రత్యేక శోభను సంతరించుకుంది. విద్యుత్ దీపాలంకరణలో ముస్తాబయింది. ఉత్సవాల సందర్భంగా అమ్మవారు ప్రతిరోజు ప్రత్యేక అలంకారాలలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ఉపకమిషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, పూజా కార్యక్రమాలలో పాల్గొని తీర్థప్రసాదములు స్వీకరిం చాలని భక్తులను ఆయన కోరారు. సాంస్కృతిక కార్యక్రమములో భాగముగా సాయంత్రం డి. వెంకటేశ్వర్లు వెనిగండ్ల వారిచే భజన, పి. ఆమని నాగప్రియ, కొల్లూరు వారిచే కూచిపూడి నత్యం, కె.వెంకటేశ్వరరావు, పెదకాకాని వారిచే గణపతి మహత్యం నాట కం, నల్లక శ్రీని వాసరావు గుం టూరు వారిచే గయోపాఖ్యానము నుండి యుద్ధం సీను ప్రదర్శించినట్లు తెలిపారు.

ముస్తాబైన మల్లేశ్వర స్వామి ఆలయం

ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు

## నేడు తుళ్లూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - తుళ్లూరు

ఉచిత ఇసుక హామీ అమలుకై సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఉదయం 11గంటలకు ధర్నా జరుగుతుందని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి తెలిపారు. ధర్నాలో భవనరంగంపై ఆధార పడిన వివిధ రకాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.గురువారం రవి తుళ్లూరులో మాట్లాడుతూ, ఉచిత ఇసుక బుకింగ్ అర్ధరాత్రి ప్రారంభించి అరగంటలోనే ఇసుక అయిపోయినట్లుగా అధికారులు చెప్పటం సరైనది కాదని, చిత్త శుద్ధితో ఉచిత ఇసుక హామీని అమలు జరిపి ఇసుకను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, కార్మికులకు రావలసిన క్లెయిమ్ చెల్లింపు లను తక్షణమే చెల్లించాలని రవి కోరారు. ధర్నాలు కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నంబూరులో కార్మికులతో మాట్లాడుతున్న వై.నేతాజీ

## ఉచిత ఇసుక హామీని అమలు చేయాలి

**నేడు పెదకాకాని తహశీల్దార్ ఆఫీసు వద్ద ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు పిలుపు**

ప్రజాశక్తి - తెనాలి

భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం పెదకాకాని తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ కోరారు. పెదకాకాని మండలం నంబూరులో గురువారం ఆయన భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన ఉచిత ఇసుక హామీని నిలబెట్టుకోవాలన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజులలో నామమాత్రంగానే ఇసుకను సరఫరా చేసిందన్నారు. గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల పెండింగ్ క్లెయిమ్స్ తక్షణమే పరిష్కరించాలన్నారు. ఆయా సమస్యలపై 4న నిర్వహించే ధర్నా జయప్రదం చేయాలని కోరారు. ఆయన వెంట నాయకులు ఎం శ్రీనివాసరావు, జె అప్పిరెడ్డి, ఏ వెంకటరెడ్డి, సుభాని మాబు పాల్గొన్నారు.

తెనాలి గాంధీ చౌక్ లో నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు నాయకులు

## ముందు చూపు లేకపోవడంతోనే ఇసుక కొరత

**ప్రజాశక్తి - తెనాలి :** ఇసుక అందుబాటులో లేకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని సిఐటియు జిల్లా నాయకులు కె బాబు ప్రసాద్ అన్నారు. ఇసుక కొరత నిరసిస్తూ షేక్ హుస్సేన్‌వలి అధ్యక్షతన గురువారం స్థానిక గాంధీ చౌక్‌లో భవన నిర్మాణ కార్మికులతో కలిసి సిఐటియు నిరసన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా బాబు ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ముందు చూపు లేనందునే ఇసుక కొరత ఏర్పడి వందలాది మంది అసంఘటిత కార్మికులు పని లేక ఇబ్బందులు పడుతున్నారని, చెప్పారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి చార్జీలు పెట్టుకుని కార్మికులు, మహిళా కార్మికులు కూడా తెనాలి వచ్చి పని లేక తిరిగి వెళుతున్నారన్నారు. ఇదే సమ స్యపై శుక్రవారం ఉదయం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా జయ ప్రదం చేయాలని కోరారు. కార్య క్రమం లో భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు ఎస్కె ఫకీర్ అహ్మద్, ఆర్ శ్రీనివాస రావు, జి గోపా లం, ఎస్కె జాని మేస్త్రీ, ఎస్కె కరిముల్లా, బి. కృష్ణయ్య, ఎంఎస్ నాని, టి నగేష్, బాబు, ఎం.

## ధర్నా జయప్రదం కోసం ప్రచారం

ప్రజాశక్తి - చేబ్రోలు

ఇసుక సమస్యల పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం చేబ్రోలు తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సిపిఎం నాయకులు హనుమంతరావు తెలియజేశారు. గురువారం చేబ్రోలు భవన నిర్మాణ కార్మికుల అడ్డాలో ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభు త్వం అధికారం లోకి వచ్చి 120 రోజులు కావస్తున్న ఇంతవరకు ఇసుక సమస్య పరిష్కరించలేదని అన్నారు. ధర్నాలో భవనిర్మాణ కార్మికుల పెద్ద సంఖ్యలో పాల్గొనే జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులుఎస్‌కె మస్తాన్ వలి, తదితరులు పాల్గొన్నారు.

## విజయ డిజిటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - అమరావతి**

విజయ డిజిటల్ షాపును పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గురువారం ప్రారంభించారు. అభివృద్ధి చెందుతున్న అమరావతి పట్టణంలో 25వ బ్రాంచ్‌ను ఏర్పాటు చేశామని యాజమాన్యం తెలిపారు. విజయ డిజిటల్ షాప్ అందరికీ అందుబాటులో ఉంటూ నాణ్యమైన పరికరాలను అందిస్తుందని ఎమ్మెల్యే అన్నారు.

## నేడు 'మరో గబ్బిలం' పుస్తకావిష్కరణ

**ప్రజాశక్తి - చిలకలూరిపేట**

బల్లికూరవ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయిని గంగవరపు సునీత రాసిన మరో గబ్బిలం పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని స్థానిక పెన్షనర్స్ హోమ్‌లో శుక్రవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పొదిలికుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాహిత్య అభిమానులు విరివిగా పాల్గొనాలని కోరారు.

## కోటప్పకొండ శాలివాహన సత్రానికి విరాళం

**ప్రజాశక్తి - చిలకలూరిపేట**

కోటప్పకొండలో నిర్మితమవుతున్న కుమ్మరి శాలివాహన, ప్రజాపతి సత్రానికి ఓ అజ్ఞాతభక్తుడు రూ.లక్ష విరాళం అందజేశాడు. ఈ సందర్భంగా పట్టణంలోని సంఘ కార్యాలయంలో గురువారం చిలకలూరిపేట నియోజకవర్గ కుమ్మరి శాలివాహన, ప్రజా పతి సంఘ అధ్యక్షుడు నిడమానూరు హనుమంతరావు ఒక ప్రకటనలో వెల్లడించారు.

## జర్నలిస్టులకు ఉచిత కంటి వైద్యపరీక్షలు

**ప్రజాశక్తి - మాచర్ల**

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఏపియూడబ్ల్యూజే కార్యాలయంలో జర్నలిస్టులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు గురువారం నిర్వహించారు. డాక్టర్ రామలింగారెడ్డి నేతృత్వంలోని మ్యాక్సివిజన్ సూపర్ స్పెషాలిటి కంటి వైద్యశాలకు చెందిన వైద్యులు కంటి పరీక్షలు చేశారు. యూనియన్ అధ్యక్షులు కె.శ్రీరామమూర్తి, మ్యాక్సివిజన్ కంటి వైద్యశాల వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఆ శాఖల్లో పాతవిధానాన్ని పాటించాలి

**ప్రజాశక్తి - మాచర్ల**

ఆస్తి పన్ను, కరెంట్ బిల్లుల అంశాలలో చంద్రబాబు హయాం 2014-19లో అమలు చేసిన విధాన్ని అవలంభించాలని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి డిమాండు చేశారు. గురువారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. జగన్ హయాంలో తీసుకొచ్చిన ఆస్తి పన్ను, కరెంటు బిల్లుల విధానాన్ని ప్రస్తుతం వెంటనే రద్దు చేయాలని కోరారు.

## రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాశక్తి పెదకూరపాడు**

కోటిన్నర రూపాయలతో బీటీ రహదారి పనుల ప్రారంభానికి టిడిపి జిల్లా అతిమళ్ళ రమేష్ శంకుస్థాపన చేశారు. గురువారం మండలంలోని జలాల్ పురం నుండి కంభంపాడు వెళ్లే రహదారి నిర్మించనున్నారు.

## చేజర్లలో వానర దాడులు

**ప్రజాశక్తి - నకరికల్లు**

మండలంలోని చేజర్లలో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. గురువారం గ్రామంలోని పఠాన్ అహ్మద్, షేక్ దావూద్‌పై దాడి చేయడంతో వారి కాళ్ల చేతులకు గాయాలయ్యాయి. గతంలో పాఠశాలకు వెళ్లే విద్యార్థులపైనా కోతులు దాడులు చేశాయి. దీంతోపాటు ఇళ్లల్లోకి వచ్చి వస్తువులు, పదార్థాలను చిందరవందర చేస్తున్నాయి. భయాందోళనలకు గురిచేస్తున్న కోతుల సమస్యలపై అధికారులుకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహానికి గురవుతున్నారు.

# వెలగని వీధి లైట్లు - ఇబ్బందుల్లో ప్రజలు

**ప్రజాశక్తి - చిలకలూరిపేట**



చిలుకలూరిపేట పట్టణ చుట్టుపక్కల్లో ఉన్న కాలనీలు చీకట్లో మగ్గుతున్నాయి. ప్రధానంగా రోడ్లు, మంచినీరు, ముఖ్యంగా విధి లైట్ల నిర్వహణ తదితర మౌలిక సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక సింగ్ నగర్, ఎంఎల్‌సి మర్రి రాజశేఖర్ ఇంటి చుట్టూ నివాస ప్రాంతాలు, ముఖ్యంగా 52 ఎకరాల్లో గల తిట్కో గృహాలకు వెళ్లే ప్రధాన రహదారి వెంబడి విద్యుత్ విధి లైట్ల సౌకర్యాలు లేక సుమారుగా నెల నెలన్నర నుంచి రాత్రులు ప్రజలు నానా ఇక్కట్లు పడుతున్నారు. అక్కడ ఉన్న ఏ స్తంభానికి ఉన్న లైట్లు వెలగటం లేదంటున్నారు. దీంతో రాత్రి కావస్తుంటే ఒక విధంగా ప్రజలు భయపడుతున్నారు. పాములు, విషజంతువులు, ప్రధానంగా దొంగలు, మద్యం బాబులతోనే సతమత మౌతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి ఈ ప్రాంతంలో విద్యుత్తు వెంటనే పునరుద్ధరించాలని ఆ ప్రాంత ప్రజలు కోరు కుంటున్నారు. అంతే కాకుండా రాత్రులు రెండు, ముడు పర్యాయములు భద్రతాసిబ్బంది గస్తీ ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను కోరుతున్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా డ్యూటీలు

**ప్రజాశక్తి-సత్తెనపల్లి**

ఉమ్మడి గుంటూరు డివిజన్‌లో ఖాళీగా ఉన్న మండల కార్యాలయాలకు నైట్‌వాచ్మెన్, అటెండర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (సిఐటియు) పల్నాడు జిల్లా అధ్యక్షులు షేక్ బందగి సాహెబ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బందగీ సాహెబ్ మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో వివిధ తహశీల్దార్ కార్యాలయాల్లో అటెండర్, నైట్ వాచ్‌మెన్‌గా డ్యూటీలు వేస్తున్నారని, గ్రామ రెవెన్యూ సహాయకులు పార్ట్ టైం ఉద్యోగులని, వీఆర్‌ఏ సర్వీసు రూల్స్‌కు విరుద్ధంగా ఈ అక్రమ డ్యూటీలు వేస్తున్నారని చెప్పారు. ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయని కారణంగా వీఆర్‌ఏలను ఇలా ఉపయోగించడం సరికాదన్నారు. వీఆర్‌ఏలకు ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. ఆర్‌డిఒ స్పందిస్తూ ఫైలు పెట్టడానికి సంబంధిత అధికారులను ఆదేశించినట్లు బందగిసాహెచ్ చెప్పారు. కార్యక్రమంలో సంఘం సత్తెనపల్లి మండల అధ్యక్షులు రవి, బెల్లంకొండ మండల అధ్యక్షులు సుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు పాల్గొన్నారు.

వినతి పత్రం ఇస్తున్న నాయకులు

## పలు మండలాల్లో 'పొలం పిలుస్తోంది'

**ప్రజాశక్తి - క్రోసూరు**

'పొలంపిలుస్తోంది' కార్యక్రమాన్ని అనంతవరం గ్రామంలో గురువారం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్, పర్యవేక్షణ అధికారి మల్లికార్జునరావు, వ్యవసాయ మార్కెటింగ్ అధికారిణి పద్మావతి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి పిల్లకతుపుల రామయ్య, ఎంపిటిసి గోగిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - బెల్లంకొండ**

మండలంలోని కందిపాడు, చంద్రాజుపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్తి, నిమ్మ తదితర పంటలు వ్యవసాయ శాఖ అధికారి కృష్ణయ్య పరిశీలించారు. పత్తిలో గులాబీ రంగు పురుగు, లద్దె పురుగు, తదితర పురుగుల గుడ్ల నిర్మూలన వివరాలను రైతులకు తెలియజేశారు. ఉద్యాన శాఖ అధికారి మోహన్, మార్కెటింగ్ అధికారి నరసింహస్వామి, పర్యవేక్షణ అధికారి నవీన్‌లు రైతు బంధు పథకం ద్వారా రైతులకు చేకూరే లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గాదె వెంకట రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - నాదెండ్ల**

మండలంలోని సాతులూరు, గొరిజవోలు గ్రామాలలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం గురువారం నిర్వహించారు. వరి, పత్తి పొలాలను సందర్శించి రైతులకు అవసరమైన సూచనలు చేశారు. క్షేత్ర పరిశీలన అనంతరం ఆయా సచివాలయంలో గ్రామసభ ఏర్పాటు చేసి రైతులకు వ్యవసాయ, అనుబంధ శాఖల కొత్త పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శోభారాణి , మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్, సాతులూరు వెటర్నరీ డాక్టర్ శ్రీలక్ష్మీ మార్కెట్ యార్డు జూనియర్ సూపర్వైజర్ ప్రసాద్, పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలు గ్రామ వ్యవసాయ అధికారులు, గ్రామ రైతులు పాల్గొన్నారు

## గ్రామసభలో సమస్యలు పరిష్కరించండి

**ప్రజాశక్తి - క్రోసూరు**

క్రోసూరు పంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో గ్రామసభ గురువారం నిర్వహించారు. సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై పంచాయతీ కార్యదర్శికి మెమోరాండం ఇచ్చారు. సిపిఎం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు, సిపిఎం క్రోసూరు గ్రామ శాఖ కార్యదర్శి చిల్కా యేషియ్య మాట్లాడారు. పంచాయతీ సమస్యలను అర్జీల రూపంలో తెలియజేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా సమస్యలను పక్కదారి పట్టకుండా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం గ్రామ కమిటీ సభ్యులు వి.అనుష, ఎస్‌కె.ముస్తఫా పాల్గొన్నారు.

అలాగే సర్పంచ్ మల్లా చందమామ, ఉప సర్పంచ్ షేక్ మస్తాన్ అధ్యక్షతన క్రోసూరు మండల కేంద్రం వద్ద గ్రామసభ నిర్వహించారు. సమావేశం జరిగింది. ఈ గ్రామ సభలో నలజాల కోటేశ్వరరావు, అనుముల వెంకట్రామిరెడ్డి, దుద్దుల యోహాను, మన్నెం శ్రీను, ఏపిఓ వెంకటేశ్వరరావు, సలాం, అనుముల వెంకట్రామిరెడ్డి, గార్లపాటి దాసు, హౌసింగ్ ఏఈ, సచివాలయం ఉద్యోగులు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు సత్కారం

**ప్రజాశక్తి - పల్నాడు జిల్లా**

ప్రతిఒక్కరూ పరిశ్రమ శుభ్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని తద్వారా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందని డిఆర్‌డిఎ పిడి బాలునాయక్ అన్నారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట మండలం లింగంగుంట్లలో గ్రామంలో స్వచ్ఛభారత్ ర్యాలీ నిర్వహించారు. ఎస్టి కాలనీ గురువారం జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. రోడ్లు శుభ్రం చేయడం, పిచ్చి మొక్కలు తొలగించడం ట్రాక్టర్‌లో తరలించటం ఆయా కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ నాయకుడు గంగుల పెద్దిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కెవి.శివప్రసాద్, ఎపిఎం భరత్, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

## గుండెపోటుతో తాళ్లపల్లి సర్పంచ్ మృతి

**ప్రజాశక్తి - విజయపురిసౌత్**

గుండెపోటుతో ఓ గ్రామ సర్పంచి మృతి చెందిన విషాద ఘటన గురువారం చోటు చేసుకుంది. మాచర్ల మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన పసుపులేటి బ్రహ్మానాయుడు(48) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. బ్రహ్మానాయుడు మూడు నెలల క్రితం సర్పంచిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. సంతాపం తెలిపేందుకు ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి శుక్రవారం విచ్చేస్తారని టిడిపి నాయకులు తెలిపారు.

## ఎక్సైజ్ సిఐగా వెంకటేశ్వర్లు

**ప్రజాశక్తి - ఈపూరు**

ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సిఐగా డి.వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా కందుకూరులో ఎక్సైజ్ సిఐగా పనిచేస్తూ బదిలీపై ఈపూరు వచ్చినట్లు ఆయన తెలిపారు. అలాగే పెదకూరపాడు నుండి బదిలీపై ఈపూరు వచ్చిన ఎక్సైజ్ ఎస్ఐ కె.శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు.ఇప్పటివరకు సెబ్ ఎస్సైగా ఈపూరులో బాధ్యతలు నిర్వహించిన ఎస్ స్వర్ణలత బదిలీపై నెల్లూరు జిల్లా కందుకూరు వెళ్లారు.సాధారణ ఎన్నికల సందర్భంలో ఆమె నెల్లూరు జిల్లా నుండి బదిలీపై ఈపూరు వచ్చారు.

## అంకితభావంతో పనిచేసే వారికి గుర్తింపు

**ప్రజాశక్తి - ఈపూరు**

వృత్తిపట్ల అంకితభావంతో పని చేసే వారికి గుర్తింపు లభిస్తుందని మండల విద్యుత్ శాఖ అధికారి ఎస్.గాంధీ బాబు అన్నారు. స్థానిక విద్యుత్ ఉపకేంద్ర కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న లైన్ ఇన్‌స్పెక్టర్ గడ్డం శ్రీనివాసరావును విద్యుత్‌శాఖ సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్ రవీంద్ర, లైన్మెన్లు రమణా నాయక్, నరేంద్ర, సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్లు,షిఫ్ట్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో వర్క్‌షాప్

**ప్రజాశక్తి - మాచర్ల**

మాచర్ల మండల పరిధిలోని న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం పైథాన్ ప్రోగ్రామింగ్‌పై వర్కు షాప్ నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన డాటా పాయింట్ ఇన్ఫో కంపెనీకి చెందిన ప్రతినిధులు న్యూటన్స్ విద్యార్థులకు పైథాన్ ప్రోగ్రామింగ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జి.జగదీశ్వర్‌రెడ్డి, హెచ్‌వోడి ఎం.నరేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపి స్మారక ఆవార్డులు

**ప్రజాశక్తి - మాచర్ల రూరల్**

స్థానిక రోటరి క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, డిబేట్, వ్యాసరచన, డాన్స్ పోటీలలో విజేతలకు మెమోంటోలు, సర్టిఫికేట్స్ అందించారు. దీనికి మిల్లేట్ రాంబాబు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. రోటరి క్లబ్ అధ్యక్షురాలు కె క్రిష్ణకుమారి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు డాక్టరు నిమ్మగడ్డ సురేఖ, డాక్టరు స్థిమిత, చెరుకూరి నరసింహరావు, చిన్ని సత్యనారాయణ, నాగూర్‌వలి, జెవికెఎస్ ప్రసాద్, ఆడిటర్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

## ఫ్రెండ్లీ పోలీస్‌లో డిఎస్‌పి

**ప్రజాశక్తి - నాదెండ్ల :** నాదెండ్ల మండలం గణపవరంలో గురువారం నరసరావుపేట డిఎస్‌పి నాగేశ్వరావు గణపవరం. గ్రామ పెద్దలను సమావేశపరిచి ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహించారు. గ్రామాల్లో శాంతి భద్రతలు కాపాడాల్సిన బాధ్యత పెద్దలదే అన్నారు. చిన్న చిన్న గొడవలు పెద్దవి కాకుండా చూడాలని వారిని కోరారు. సమస్యలు పెదవి కాకుండా గ్రామాల్లోని పరిష్కరించుకోవాలన్నారు. పోలీసులతో ప్రేమపూర్వకంగా మెలిగి వారికి సహకరించాలని డిఎస్పీ కోరారు. కార్యక్రమంలో నాదెండ్ల ఎస్సై పుల్లారావు, గ్రామ పెద్దలు కెల్లంపల్లిఅచ్చయ్య, కంచర్ల శ్రీనివాసరావు ఉన్నారు.

విజయవాడ ఎంబివికెలో

# 8న కౌలురైతుల సదస్సును జయప్రదం చేయండి

**ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ :** రాష్ట్రవ్యాప్తంగా కౌలు రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం ఈనెల 8న తలపెట్టిన కౌలు రైతుల సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు అన్నారు. బుధవారం రాత్రి ఎంటిఎంసీ పరిధిలోని చిర్రావూరు గ్రామంలో కౌలురైతులను కలుసుకొని, పంట నష్టపోయిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ ఆగస్టు నెల చివరిలో కురిసిన అధిక వర్షాలకు, బుడమేరు ముంపు, కష్ణానది వరదల కారణంగా వరి, పసుపు, కంద వంటి పంటలు నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని కోరారు. ప్రధానంగా కౌలు రైతులకు పెట్టుబడి, కౌలు అదనపు భారంగా మారిందన్నారు. పంటలు నీట మునగడంతో కౌలు రైతులు భారీగా పంట నష్టపోయారన్నారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రకటించిన వరికి రూ.పదివేలు, వాణిజ్య పంటలకు రూ.14 వేలు రైతులకు సరిపోయే పరిస్థితి లేదన్నారు. నష్టపరిహారం అందని కౌలు రైతులందరూ నష్టపరిహారం కోసం అర్జీలు తీసుకొని, సమస్యను పరిష్కరించుకునేందుకు ఈ నెల 8వ తేదీన విజయవాడ మాకినేని బసవ పున్నయ్య ఆడిటోరియంలో జరిగే కౌలు రైతుల సదస్సుకు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు, రైతు సంఘం నాయకులు దొంత రెడ్డివెంకటరెడ్డి, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు పరిమి శెట్టి శివ నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం నాయకులు పల్లపాటి సుబ్బారావు, పోకల శంకర్, తాడే కోరు ఏసుబాబు, తాడే కోరు కొండయ్య, ధనేకుల వేణు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - చేబ్రోలు :** ఇటివల మండలంలో వరదల ప్రభావంతో నష్టపోయిన కౌలురైతులు, రైతులందరికి పంట నష్టపరిహారం అందించాలని ఆంధ్ర ప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు డిమాండు చేశారు. గురువారం చేబ్రోలు రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా బైరగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు నష్టపరిహారం ఇస్తామని చెబుతున్నప్పటికీ అది ఆచారణకు నోచుకోవడం లేదన్నారు. భూయజమానులు భూస్వాములకే నష్టపరిహారం ఇచ్చారని, దీనివల్ల కౌలు రైతులు అన్యాయ మయ్యారన్నారు. రాజకీయ కారణాలతో మండలంలోని వీరనాయకునిపాలెంలో నిమ్మ, దొండ, కాకర వంటి పంటలకు నష్టపరిహారం రాయకపోవడం దుర్మార్గమన్నారు. ఆన్‌లైన్ కాని భూములకూ పంట నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. అనంతరం ప్రత్యేక గ్రీవెన్సులో రైతులతో కలిసి తహశీల్దారుకు వినతిపత్రం ఇచ్చారు. మండలంలో పంట నష్టపోయిన రైతుల అర్జీలను, పొలాలను పరిశీలించి, ఇప్పటికే లిస్ట్ తయారు చేశామని తహసిల్దార్ కె.శ్రీనివాసశర్మ తెలిపారు. కౌలురైతుల పొలాలను పరిశీలించి, పంటనష్టం జరిగి అర్హత ఉన్న రైతుకు న్యాయం చేస్తా మని చెప్పారు. కార్యక్రమములో యర్రాకుల వీరాంజనేయరాజు, టి.సుబ్బారావు, డి.రత్తయ్య, ఓ.నాగరాజు, కె.శివయ్య, సిఐటియు నాయకులు షేక్ మస్తాన్‌రావు పాల్గొన్నారు.

కౌలురైతులతో మాట్లాడుతున్న నాయకులు మాగంటి హరిబాబు

చేబ్రోలులో తహశీల్దార్‌నకు వినతి పత్రం ఇస్తున్న రైతులు, నాయకులు

**ప్రజాశక్తి - తెనాలిరూరల్ :** కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8న నిర్వహించనున్న విజయవాడ సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు అన్నారు. గురువారం తెనాలి గోలి డొంక పొలాల వద్ద రైతులతో కలసి చలో విజయవాడ కరపత్రాన్ని విడుదల చేశారు. నష్టపరిహారం అందని కౌలు రైతులు గ్రామాల వారీగా అర్జీలు తీసుకొని విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రానికి తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి, రైతులు పొట్లూరి రామయ్య, తులిమిల్లి నాగేశ్వరరావు, జెట్టి శ్రీను, కల్లూరి శ్రీను, మేకల చిట్టిబాబు పాల్గొన్నారు.

## ఎకో పార్క్ వాకర్స్ సమస్యలు పరిష్కరిస్తా

**ప్రజాశక్తి - మంగళగిరి**

మంగళగిరి ఎకో పార్క్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళగిరి ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను అసోసియేషన్ ప్రతినిధులు కలిసి సమస్యలపై వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వరద బాధితులకు రూ.50 వేలా 116 చెక్కును మంత్రి లోకేష్‌కు అందజేశారు. ఏకోపార్క్‌లోని సమస్యలను వివరించారు. వాకర్స్‌కు ఫీజు మినహాయింపు ఇవ్వాలని కోరారు. వాకింగ్ ట్రాక్ను అభివృద్ధి చేయాలని విన్నవించారు. మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. సాధ్యమైనంత త్వరలో సమస్య పరిష్కరిస్తానని మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చినట్టు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పి.కోటేశ్వరరావు వీసం వెంకటేశ్వరరావు తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ అంకం శ్రీనివాసరావు (బాబు) వైస్ ప్రెసిడెంట్ పెద్దిరాజు .ట్రెజరర్ గోలి బాల మోహన్ రావు కార్యవర్గ సభ్యులు షేక్ హుస్సేన్ ఉన్నారు.

## వైసిపి బలోపేతానికి కృషి : వేమారెడ్డి

**ప్రజాశక్తి - తాడేపల్లి**

మంగళగిరిలో వైసిపి బలోపేతానికి కృషి చేస్తామని, రాబోయే రోజుల్లో పార్టీకి పూర్వవైభవం తీసు కొస్తామని ఆ పార్టీ ఇన్‌ఛార్జి దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుంటామన్నారు. వైసిపి అధినేత జగన్ సూచనలు పాటిస్తూ ముందుకు సాగుతామన్నారు. కార్యకర్తలకు అన్ని విధాలా అందుబాటులో ఉంటామని చెప్పారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ దారుణమన్నారు. ప్రజలను మభ్యపెట్టి మాయ చేయటంలో సిఎం చంద్రబాబు నంబర్‌వన్ అని విమర్శించారు. వరద బాధితులకు సరైన సహాయం అందలేదన్నారు. టిడిపి లడ్డు అంశాన్ని తీసుకొవచ్చి ఇచ్చిన హామీలను తుంగలోతొక్కారన్నారు.

# ఇప్పటంలో రక్షిత నీటి పథకం ప్రారంభం

**ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్**

ఎంటిఎంసీ పరిధిలోని ఇప్పటం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకంను పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య గురువారం ప్రారంభించారు. రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేసిన దివీస్ ల్యాబరేటరీస్ వారిని, అందుకు కృషి చేసిన మంత్రి నారా లోకేష్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం టిడిపి గ్రామ అధ్యక్షులు శంకరశెట్టి పిచ్చియ్య అధ్యక్షతన సభ నిర్వహించారు. నందం అబద్ధయ్య మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ నియోజకవర్గ ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంతో పాటు, పలు చోట్ల సొంత నిధులతో రక్షిత మంచి నీటి పథకాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంత్రి నారా లోకేష్ ఇప్పటం గ్రామాన్ని రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తారని చెప్పారు. తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు మాట్లాడుతూ 100 రోజుల్లో కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, టిడిపి గ్రామ అధ్యక్షులు శంకరశెట్టి పిచ్చియ్య, జనసేన గ్రామ అధ్యక్షులు గాజుల రాంబాబు, టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు, ఈపూరి బాబు, సాదు చంద్రశేఖర్, జముడు గాని రత్తయ్య, జముడుగాని మహేంద్ర, కాటూరి నాగేశ్వరరావు, లంగోత్ నరసయ్య గాజుల నగేష్. శ్రీధర్ పాల్గొన్నారు.

# గ్రామసభల ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించండి

**ప్రజాశక్తి - మేడికొండూరు**

మండలంలోని అన్ని పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఎంపిడిఓ తోట చందన అన్నారు. గురువారం మండల కేంద్రమైన మేడికొండూరు సచివాలయం పరిధిలో పంచాయతీ సర్పంచ్ కె.నాగమణి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు ఎంపిడిఓ తోటచందన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు జిఓఎంఎస్ 791 జిఎడ జిఓఎంఎస్ 162 పిఆర్‌ఆర్‌డి ప్రకారం మండలంలోని అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించాలన్నారు. 73వ రాజ్యాంగ సవరణ స్థానిక స్వపరిపాలనకు మార్గం సుగమం చేసిందని, వ్యవసాయం, విద్య, గృహాలు, తాగునీరు తదితర 29 అంశాలపై పంచాయతీలకు అధికార పరిధి ఉందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలందరినీ పాఠశాలకు పంపించి డ్రాప్ అవుట్‌లను నివారించాలని పేర్కొన్నారు. బాల కార్మికులు బాల్య వివాహాలను నిర్మూలించేల చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్య కార్మికుల సేవలను, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామస్తులు ఇళ్లలో పరిశుభ్రత పాటించాలని, పొడి చెత్త, తడి చెత్తను వేరు పారిశుధ్యకార్మికులకు సహకరించాలన్నారు. సర్పంచి కె.నాగమణి

మాట్లాడుతూ గ్రామస్తులు సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి శివరాం గత ఆర్థిక సంవత్సరం, రాబోయే ఆర్థిక సంవత్సరం పనులను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - చేబ్రోలు**

మండలంలోని అన్ని గ్రామాల్లో సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భముగా ఇఓపిఆర్‌అండ్‌ఆర్‌డి జి.శ్రీనివాసరావు మాట్లాడారు. పంచాయతీ పరిపాలనా విషయాలపై తెలియజేశారు. కార్మికులకు అర్హతలు ఉన్న ప్రతి సంక్షేమ పథకాలను అనుసంధానం చేయాలని తీర్మానించారు. అభివద్ధి శాఖల మండల, గ్రామస్థాయి అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వార్డు మెంబర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## వరద బాధితులకు సిఐటియు సాయం

**ప్రజాశక్తి - తాడేపల్లి**

వరద బాధితులకు తాడేపల్లి ప్రకాష్‌నగర్‌లోని సిఐటియు కార్యాలయంలో సాయాన్ని గురువారం అందజేశారు. ఆశ, అంగన్‌వాడీ, మున్సిపల్ వర్కర్లు, యానిమేటర్లకు సరుకులు, దుప్పట్లు, కండువాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి, సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు డి.రమాదేవి, ఆర్‌వి నరసింహులు, జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ, వేముల దుర్గారావు, కె.లక్ష్మి, బూరుగ వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీలు హేమలత, జి.సుజాత పాల్గొన్నారు.

## పంటనష్ట తీవ్రతపై రైతులకు అవగాహన

**ప్రజాశక్తి - చేబ్రోలు**

మండలంలోని వడ్లమూడి నారాకోడూరు గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. గుంటూరు జిల్లా వనరుల కేంద్రం డిడిఏ సునీత, వ్యవసాయ అధికారులు మాట్లాడారు. పంట నమోదు గురించి రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో పొన్నూరు సహాయ వ్యవసాయ సంచాలకులు వి. రామకోటేశ్వరి, మండల వ్యవసాయ అధికారి, ప్రకృతి వ్యవసాయం శాఖ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు, ఎఇఓ సునీతా, విఎఎ రత్నబాబు, విహెచ్ ఎ.శివ, ఇరు గ్రామల రైతులు ప్రకృతి వ్యవసాయం శాఖ శ్యామ్, అనూష పాల్గొన్నారు.

## నూతన ఆర్‌ఐగా సాహితీ మోహన్

**ప్రజాశక్తి - పెదనందిపాడు**

పెదనందిపాడు మండలం నూతన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా యలవర్తి సాహితీమోహన్ ఉద్యోగ బాధ్యతలను గురువారం స్వీకరించారు. వారు ఫిరంగిపురం మండలం నుంచి బదిలీలలో భాగంగా పెదనందిపాడుకు వచ్చారు. వారికి మండల తహశీల్దారు పి.శంకర్‌బాబు, కార్యాలయం సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

## వరద బాధితులకు చేనేతల చేయుత

**ప్రజాశక్తి - మంగళగిరి**

ఇటీవల సంభవించిన వరదల్లో నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు మంగళగిరి చేనేతలు ముందుకు వచ్చారు. గురువారం ఉండవల్లిలోని రాష్ట్రమంత్రి నారా లోకేష్‌ను కలిసి రూ.రెండు లక్షలు చెక్కును ఆయనకు అందజేశారు.

## నాట్కో పాఠశాలలో దసరా ఉత్సవాలు

**ప్రజాశక్తి- పొన్నూరు**

పొన్నూరు మండలం గొల్లమూడి పాడు గ్రామంలోని హిప్పో క్యాంపస్ వారిచే నిర్వహించబడుతున్న నాట్కో స్కూల్ ఆఫ్ లెర్నింగ్ పాఠశాలలో ముందస్తు దసరా ఉత్సవాలను అత్యంత ఘనంగా గురువారం నిర్వహించారు. దసరా పూజ, పాఠశాలలోని మహిళా పేరెంట్స్‌కు రంగోలి పోటీలు పెట్టారు. రంగోలి పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఉర్మి, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విజయవాడ ఇంద్రకీలాద్రిపై

## దసరా ఉత్సవాల సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు : ఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

విజయవాడ ఇంద్రకిలాద్రిపై జరుగుతున్న దసరా ఉత్సవాలను పురస్కరించుకుని జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్టు జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లా నుండి విశాఖపట్నం వెళ్లే లారీలను బుడంపాడు జంక్షన్ వద్ద హైవే దిగి తెనాలి, వేమూరు, కొల్లూరు, వెల్లటూరు జంక్షన్, పెనుమూడి బ్రిడ్జ్, అవనిగడ్డ , పామూరు , గుడివాడ, హనుమాన్ జంక్షన్ మీదుగా విశాఖ వైపు వెళ్లాలన్నారు. చెన్నై నుండి విశాఖ పట్నం వెళ్లే లారీలు గుంటూరు నుంచి విజయవాడ మీదుగా హైదరాబాద్ వైపు లారీలు పేరేచర్ల జంక్షన్ నుంచి సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదుగా హైదరాబాద్ వెళ్లాలన్నారు. చిలకలూరి పేట వైపు నుండి విజయవాడ మీదుగా హైదరాబాద్ వైపు వెళ్లే లారీలు చిలకలూరి పేట, చుట్టుగుంట, పేరేచర్ల, సత్తనపల్లి, పిడుగురాళ్ల మీదుగా వెళ్లాలన్నారు.గుంటూరు నుండి విజయవాడ వైపునకు వెళ్లే వాహనాలలో అత్యవసర వాహనాలను మాత్రమే అనుమతిస్తామన్నారు.

జీనోమిక్స్ సెంటర్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న వీసీ, తదితరులు

## విజ్ఞాన్‌లో 30ఎమ్ జీనోమిక్స్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో హైదరాబాద్‌కి చెందిన 30ఎమ్ జీనోమిక్స్ స్టార్టప్ కంపెనీ తన సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్టీ సపోర్టెడ్ విజ్ఞాన్స్ టీబీఐ, 30ఎమ్ జీనోమిక్స్ స్టార్టప్ కంపెనీల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'మినీ డీఎన్‌ఏ ల్యాబ్' సెంటర్‌ను విజ్ఞాన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఒకే రోగంతో బాధపడుతున్న వివిధ రకాల వ్యక్తులకు ఒకే రకమైన వైద్యం సరిపోదని, వారి డీఎన్‌ఏల ఆధారంగా వ్యక్తిగతమైన వైద్యం అవసర మన్నారు. అందుకనుగుణంగా 30ఎమ్ జీనోమిక్స్ స్టార్టప్ కంపెనీ వ్యక్తిగత ఔషధాలలో భాగంగా ఫార్మకోజెనిటిక్స్ అప్రోచ్ ద్వారా ఔషధానికి సంబంధించిన డోస్‌లను ముందుగానే గుర్తించడం జరుగు తుందన్నారు. అంతేకాకుండా ఈ ల్యాబ్‌లో నిర్వహించే పరీక్షల ద్వారా సడెన్ కార్డియక్ అరెస్ట్‌లకు గురయ్యే అవకాశం ఉన్న వారిని ముందుగానే గుర్తించవచ్చున్నారు. ఇలా గుర్తించినవారిని కార్డియక్ అరెస్ట్‌కు గురి అవ్వకుండా 80 శాతం నివారించవచ్చని తెలిపారు. వీటితోపాటు ఎవరైతే భవిష్యత్‌లో బట్టతలకు గురయ్యే అవకాశం ఉందో వారిని కూడా గుర్తించవచ్చునన్నారు. ఈ కార్డియక్ స్క్రీనింగ్ టెస్ట్, బట్టతల టెస్ట్‌ను కేవలం రూ.499లకే నిర్వహించి 24 గంటల్లోనే రిపోర్ట్ ఇస్తారని వెల్లడించారు. అనంతరం 30ఎమ్ జీనోమిక్స్ స్టార్టప్ కంపెనీలో ఉద్యోగాలు పొందిన విద్యార్థు లకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో 30ఎమ్ జీనోమిక్స్ స్టార్టప్ కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ బెన్నెట్ బాస్కోదాస్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, 30ఎమ్ జీనోమిక్స్ డైరక్టర్లు పావని తదితరులు పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న చంద్రశేఖర్ రెడ్డి

## సుమేధా హైస్కూల్‌కు బెస్ట్ స్కూల్ అవార్డు

**ప్రజాశక్తి-గుంటూరు :** స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక ఎన్‌జిఓ కాలనీలోని సుమేధా హైస్కూల్‌కు బెస్ట్ స్కూల్ అవార్డు దక్కిందని స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా గుంటూరు నగరపాలక సంస్థ వెంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా ముగింపు కార్యక్రమంలో కేంద్ర సహాయక మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే గళ్లా మాధవి, మహమ్మద్ నసీర్, కలెక్టర్ నాగలక్ష్మి, కమిషనర్ పులి శ్రీనివాసులు చేతుల మీదుగా చంద్రశేఖర్ రెడ్డి అవార్డు అందుకున్నారు.

## చిప్స్‌లో ముగిసిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు

**ప్రజాశక్తి-గుంటూరు :** చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కాలేజిలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గత పది రోజులుగా నిర్వహించిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు ముగిశాయి. సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకూ కళాశాల ప్రాంగణం, పరిసర గ్రామాలు చౌడవరం, దాసరి పాలెం, యనమదలలో స్వచ్ఛతపై అవగాహన, ప్లాస్టిక్ వాడకం వల్ల నష్టాలు, రోడ్డు భద్రతా విషయాల గురించి విద్యార్థులు అవగాహన కల్పించారు. వేడుకల ముగింపు సందర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధరరావు, విద్యార్థులు పాల్గొన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు నిర్వహించిన విద్యార్థులను కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ సి.ఎన్. శ్రీనివాస్, కోశాధికారి రాయపాటి గోపాలకృష్ణ తదితరులు అభినందనలు తెలిపారు.

మానహారంలో పాల్గొన్న విద్యార్థులు

## గుంటూరుకు ఔటర్ రింగ్ రోడ్డు

- వినుకొండ - గుంటూరు వరకు నాలుగు లైన్ల హైవే
- అమరావతికి కనెక్టివిటీతో నూతన ప్లాన్
- 5-6 నెలల్లో పనులు ప్రారంభించేలా చర్యలు
- అధికారులతో సమీక్షలో కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

'ఉమ్మడి గుంటూరు జిల్లాలో వినుకొండ టూ గుంటూరు వచ్చే నేషనల్ హైవే నాలుగు లైన్ల విస్తరణకు చర్యలు చేపట్టామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. అధికారులు అమరావతికి కనెక్టివిటీతో నూతన ప్లాన్ సిద్ధం చేశారని ఇది పూర్తయితే గుంటూరుకు మరో ఔటర్ రింగ్ రోడ్డులా మారుతుందని ఆయన తెలిపారు. స్థానిక కలెక్టరేట్ లో నేషనల్ హైవేస్ అధికారులతో పెమ్మసాని గురువారం సమీక్షించారు. అనంతరం కలెక్టర్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గుంటూరు జిల్లాలో రెండు నేషనల్ హైవేస్ ఉన్నాయని, ఒకటి ఈస్ట్రన్ బైపాస్ నేషనల్ హైవేస్-16 అని, మరొకటి వినుకొండ - గుంటూరుకు గతంలో నాలుగు లైన్ల హైవే నిర్మాణానికి ప్లాన్ రూపొందించారని, దీనిని అమరావతికి కనెక్టివిటీతో సరికొత్త ప్లాన్ రూపొందించారని చెప్పారు. 25 కిలోమీటర్లు పెరిగినప్పటికీ కొత్త ప్లాన్ చాలా బాగుందని, గుంటూరుకు మరో ఇన్నర్ రింగ్ రోడ్డుగా ఉపయోగపడుతుందని ఆయన వెల్లడించారు. దీనికి సంబంధించి అగ్రికల్చర్ ఎన్ ఓ సీ, ల్యాండ్ ఎక్విజేషన్ వంటి అంశాలపై చర్చించామని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో ప్రాజెక్టును 5 - 6 నెలల్లో పనులు ప్రారంభిస్తే రెండేళ్లలో పూర్తి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, బూర్ల రామాంజనేయులుతో పాటు కలెక్టర్ నాగలక్ష్మి, పలు శాఖాధికారులు అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

## మెడికల్ కళాశాల అభివృద్ధికి కృషి

మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరసింహం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు మెడికల్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు డైరక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఈ) డాక్టర్ నరసింహం తెలిపారు. గుంటూరు మెడికల్ కళాశాలలో గురువారం కళాశాల అభివృద్ధి కమిటీ సమావేశం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టిటికే రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహం పలు సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ కొన్ని అంశాల గురించి సూచనలు అందించారు. ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీలో జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రజా ప్రతినిధులు ఉన్నారని అదే విధంగా మెడికల్ కళాశాల అభివృద్ధి కమిటీలో కూడా జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు ప్రాతినిధ్యం ఉండాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. దీనివల్ల మెడికల్ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి లను సింగిల్ యూనిట్ గా తీసుకొని జిల్లా కలెక్టర్, ప్రతినిధులు సి ఎస్ ఆర్ ఫండ్స్ ద్వారా అభివృద్ధి చేసేందుకు అవకాశం కలుగుతుందని ఆయన చెప్పారు. అందుకు డియంఈ స్పందిస్తూ మెడికల్ కళాశాల అభివృద్ధి కమిటీలో వారిని చేర్చే విషయంలో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించి అనుమతి తీసుకుంటామని ఆయన చెప్పారు. బొంగరాల బీడు లోని ఆరు ఎకరాల స్థలాన్ని కాపాడేందుకు హెచ్ డి ఎస్ లో తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని డియం ఈ హామీ ఇచ్చారు. మెడికల్ కళాశాల అభివృద్ధి కమిటీలో కేవలం 7, 8 విభాగాల తో పాటు ప్రభుత్వ ఆసుపత్రిలోని వివిధ విభాగాలను కూడా సమదృష్టితో చూడాలని సూపరింటెండెంట్ సూచించారు. ఆసుపత్రి లోని ప్రతి విభాగం కు అవసరమైన పరికరాలను సిడిఎస్ ఫండ్స్ నుంచి ఇవ్వాలని సూపరింటెండెంట్ కోరగా ఈ ప్రతిపాదనలను వివిధ విభాగాల హెచ్ ఓ డి లు, ప్రిన్సిపల్ ద్వారా నిర్ణయం తీసుకోవాలని డి యం ఈ ఆదేశించారు. ముఖ్యమైన పరికరాలను కొనుగోలు చేసేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని అన్నారు. స్వచ్ఛభారత్‌లో పాల్గొనే వాలంటీర్లను ఎన్‌సిసి, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులను భాగస్వాములు చేయాలని సూపరింటెండెంట్ కోరగా ప్రిన్సిపల్ తో చర్చించి నిర్ణయం తీసుకోవాలని డి యం ఈ చెప్పారు. సమావేశంలో డాక్టర్ ఉమా జ్యోతి, డాక్టర్ శంకర రావు, డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## పైలెట్ ప్రాజెక్టుగా మంగళగిరి, తుళ్లూరులో నైపుణ్య గణన సర్వే

**ప్రజాశక్తి - మంగళగిరి :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నైపుణ్య గణన సర్వే కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టుగా మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గంతోపాటు తుళ్లూరు మండలంలో రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 30న ప్రారంభించారు. గురువారం మంగళగిరిలో జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ తో కలసి నైపుణ్య గణన సర్వేను పరిశీలించారు. మంగళగిరి పట్టణంలో వీవర్స్ కాలనీ సచి వాలయం పరిధిలో గాయత్రి నగర్ లో నైపుణ్య గణన సర్వేలో భాగంగా నైపుణ్య యాప్ లో కుటుంబ సభ్యుల నైపుణ్య వివరాలను ఎన్యూమరేటర్లు నమోదు చేస్తున్న వివరాలను జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి పరిశీలించి సూచనలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి విలేకరులతో మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టు సర్వేలో వచ్చిన అంశాలు ప్రకారం రాష్ట్ర వ్యాప్త సర్వేను మెరుగ్గా నిర్వహించటానికి ప్రభుత్వం చర్యలు తీసు కుంటుందన్నారు. సర్వే కోసం ఎన్యూ మరేటర్లుగా మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల, సీఆర్డీఏ పరిధిలోని తుళ్ళూరు మండలాల్లోని 1040 మంది సచివాలయ ఉద్యోగులకు ఇప్పటికే శిక్షణ అందించటం జరిగిందన్నారు. నైపుణ్యాభివృద్ధి శాఖ రూపొందించిన నైపుణ్య యాప్ లో ఇంటింటికి వెళ్ళి కుటుంబంలోని వారందరి నైపుణ్యాల వివరాలను నమోదు చేయటం జరుగుతుందన్నారు. యాప్ లో నమోదు చేసిన వివరాలను నిర్ధారిస్తూ ఆధార్ కార్డు ఆథంటికేషన్ ఓటీపీ ద్వారా ప్రజలు నిర్ధారించాల్సి ఉందన్నారు. నైపుణ్య సర్వేను పూర్తిగా ప్రభుత్వ ఉద్యోగులైన సచివాలయ ఉద్యోగులతోనే నిర్వహిస్తున్నామని, నైపుణ్య యాప్ లో వివరాలు నమోదుకు అధార్ కార్డు ఓటీపీ చెప్పటానికి ఎవరు సందేహపడాల్సిన అవసరం లేదన్నారు. కేవలం యాప్ లో నమోదు చేసిన వివరాలను నిర్ధారించటానికే ఓటీపీ పనిచేస్తుందన్నారు. ప్రతి కుటుంబంలోని పదిహేను సంవత్సరాల నుంచి 59 సంవత్సరాలు వయస్సు లోపు ఉన్న నిరుద్యోగులు, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్, ఉద్యోగుల వివరాలను సర్వేలో నమోదు చేయటం జరుగుతుందన్నారు. సర్వే పూర్తి అయ్యేలా ప్రజలు సహకారం అందిం చాలన్నారు. అనంతరం ఎంటీఎంసీ కమిషనర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి నైపుణ్య గణన సర్వే పై నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారులు, మున్సిపల్, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్దేశించిన సమయానికి పూర్తి అయ్యేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి ఈడీ అనిల్ కుమార్, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, జిల్లా అధికారి సంజీవరావు, జిల్లా ఉపాధి అధికారి రఘు, మంగళగిరి, తాడేపల్లి తహశీల్దారు సుభాని, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో కొత్తగా 36 పోలింగ్ కేంద్రాలు

ఈసీకి ప్రతిపాదనలపై రాజకీయ పార్టీలతో సమావేశంలో కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియలో భాగంగా గుంటూరు జిల్లాలో 36 కొత్త పోలింగ్ బూత్‌లు గుర్తించినట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేయాల్సిన పోలింగ్ బూత్‌లపై రాజకీయ పార్టీలు, ఈఆర్ఒలతో గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్త కేంద్రాల వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించి, గురువారం సాయంత్రానికి ఈసికి పంపించాల్సి ఉందని తెలిపారు.1500 మందికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ బూత్‌లను కొత్త పోలింగ్ స్టేషన్లుగా ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఆ మేరకు జిల్లాలోని ఏడు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో 36 క్రొత్త పోలింగ్ స్టేషన్‌లను గుర్తించటం జరిగిందని తెలిపారు. తాడికొండ నియోజకవర్గంలో ఒక పోలింగ్ స్టేషన్, మంగళగిరి నియోజ కవర్గంలో 17, ప్రతిపాడు నియోజకవర్గంలో 3, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో 9, గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 6 కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాల్సి ఉందన్నారు. తాడికొండ, గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల పరిధిలో క్రొత్తగా ఏర్పాటు చేయబడే పోలింగ్ స్టేషన్లపై సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సూచించిన అంశాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకోవటం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. సమావేశంలో డిఆర్ఒ పెద్ది రోజా, టిడిపి నుండి కంచర్ల శివ రామయ్య, కాంగ్రెస్ నుండి బిళ్ళా సునీల్, బిఎస్‌పి నుండి సిహెచ్ వాసు, ఆప్ నాయకులు డాక్టర్ టి.సేవాకుమార్, సిపిఐ(యం) నుండి వై.కృష్ణ కాంత్, ఈఆర్ఒలు గంగరాజు, లక్ష్మీ కుమారి, శ్రీనివాసరావు, ఓబులేసు, శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి